Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, మే 09, 2026 | సంపుటి - 20 | సంచిక 233 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

ప్రధాని పర్యటన తరవాత
## రాజకీయ మార్పులు
బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందం ్రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు.

తరువాయి 2లో

దేశం గర్వించేలా
## కొడంగల్ అభివృద్ధి

కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా

430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం

కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపనలు



దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు.

కొడంగల్ : 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగి ంచారు. పేదల తిరుపతిగా పేరుగాం చిన కొడంగల్ శ్రీ మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవర దాచార్యులు కలలుగన్న

తరువాయి 2లో

## బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

రాష్ట్ర సిఎంగా సువేందు అధికారి

శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక

అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ

నేడు సిఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం

ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు

2లో





2లో

## పోలీస్ అధికారి భార్య హత్య

నేపాలీ గ్యాంగ్‌గా అనుమానం

క్లూ ఆధారంగా వేగంగా విచారణ

నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్ : జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబం ధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింప బడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు.



## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

నరగంలో వరుస హత్యలు ఆందోళనకరం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపో యిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయం లోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి

2లో

తలసేమియా
## అంటు వ్యాధికాదు

జన్యుపరమైన లోపంతో వచ్చే వ్యాధి

బ్లడ్ రిలేషన్ వివాహాలతోనూ సంక్రమించే ఛాన్స్

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్ : తలసేమియా అంటు వ్యాధి కాదని.. ఇది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన వ్యాధి అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లా డుతూ.. సమీప బంధువుల మధ్య వివాహాలు జరిగే సందర్భాల్లో ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మరింత పెరుగు తుందన్నారు. యువత వివాహానికి ముందు తప్పనిసరిగా స్ర్కీనింగ్ చేయించుకోవాలన్నారు.

తరువాయి 2లో

## మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు

తొలిదశలో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్

తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశం

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా నిధులు

కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం



హైదరాబాద్ : మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను తొలగించి

తరువాయి 2లో




దేశం గర్వించేలా
## కొడంగల్ అభివృద్ధి

దేశం గర్వించేలా

గవర్నెన్స్‌లో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ ముఖ్యం

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకోవడం సరికాదు

సిఎస్ నుంచి మండలస్థాయి వరకు ఫైళ్ల క్లీయరెన్స్ వేగం పెంచాలి

ఆన్‌లైన్ ఫైలింగ్ అన్నది పూర్తిగా అందుబాటులోకి రావాలి

మాన్యువల్ ఫైలింగ్ విధానం తుడిచిపెట్టుకు పోవాలి

టెక్నాలజీతో పోటీపడి ముందుకు సాగాలి

రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు కీలక సూచనలు

అమరావతి : స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి ముఖ్యమైన అంశమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎస్, సెక్రటరీలు, హెచ్‌వోడీలు మొదలు కొని.. మండల స్థాయి వరకు ఫైళ్ల క్లియరెన్సులో వేగం పెంచాలని ఆదేశించారు. రు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ.. ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందు బాటులోకి తెస్తే

2లో




## కిడ్నీ రోగులకు అండగా ప్రభుత్వం

రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి : రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లా డుతూ.. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు

## సోనార్ బంగ్లా కోసం కృషి



మహనీయుల కలలు సాకారం చేస్తాం

దశాబ్దాలుగా భయం గుప్పిట్లో బెంగాల్

గో అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం

చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం

సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి దేశాన్ని రక్షస్తాం

కక్షసాధింపు రాజకీయాలకు బిజెపి దూరం

బిజెపి లెజిస్లేచర్ పార్టీ భేటీలో అమిత్ షా స్పష్టీకరణ

కోల్‌కతా : సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తు ందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు

2లో

# ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# పోలీస్ అధికారి భార్య హత్య

రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని.. ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# తలసేమియా అంటు వ్యాధికాదు

కొత్తగా వివాహమైన దంపతులకు కూడా జన్యుపరమైన, ఇతర వ్యాధులపై అవగాహన అవసరమని వెల్లడించారు. తలసేమియా, ఇతర జన్యుపరమైన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే సికిల్‌సెల్ వ్యాధిపై దాదాపు 11 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ హాస్పిటళ్లలో ఉచితంగా చికిత్స, అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. తలసేమియా బాధితులకు క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరం అవుతుందన్నారు. ఐరన్ చెలేషన్ థెరపీ వంటి చికిత్సలు కూడా అవసరం అవుతాయన్నారు. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో బోన్ మ్యారో ట్రాన్స్‌ఎ÷–లాంట్ అవసరం అవుతుందని చెప్పారు. ఈ చికిత్సల ఖర్చు కుటుంబాలపై భారీ భారం అవుతుందన్నారు. అందుకే తలసేమియా, ఇతర రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్ని దశల్లో అండగా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో రెగ్యులర్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్స్, అవసరమైన మందులు, అధునాతన చికిత్స సౌకర్యాలను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు.హైదరాబాద్‌లోని నిమ్స్‌లో బోన్ మ్యారో ట్రాన్స్‌ఎలాంట్ వంటి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతర సేవలు అందించేందుకు ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మంలో డే కేర్ సెంటర్లు ఉన్నాయని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు

రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించనున్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక పర్యవేక్షణకు సహకారం తీసుకోనున్నారు. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

# ఇండీ కూటమికి బీటలు

## కూటమి నుంచి వైదొలగిన డిఎంకె కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ పార్టీ

చెన్నై,మే8 : తమిళనాడు రాజకీయాలు క్రమంగా మారుతున్నాయి. విజయ్ టివికెకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో ఘాటుగా విమర్శించిన డిఎంకె ఇండి కూటమి నుంచి బయటకు వచ్చింది. ఈ మేరకు ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. ఇక కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసినట్లేనని వెల్లడించింది. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి తాజాగా లేఖ రాశారు. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోలేమని అందులో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగడాన్ని ఖండించారు. కూటమికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని.. పాత రాజకీయ స్వభావాన్ని ఆ పార్టీ మార్చుకోలేదని ఆక్షేపించారు. కూటమి వల్లే కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ద్రోహాన్ని అధిగమించి బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం వ్యతిరేకించారు. స్వలాభాల కోసం కూటమి నేతలను వదులుకోవడం సరైన చర్య కాదన్నారు.

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ-వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

ప్రజల సమయం వృధా కాదని తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందని సూచించారు.వాట్సాప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని సీఎం తెలిపారు. మాన్యువల్ ఫైళ్లనేవి దాదాపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఫైళ్లక్లియరెన్స్, అవేర్, డేటా లేక్ అంశాలపై సీఎం సమీక్షించారు. ఫైళ్లను త్వరగా క్లియర్ చేస్తే ప్రభుత్వ సేవలు మరింత త్వరగా అందుతాయని సీఎం అన్నారు. పాలనకు టెక్నాలజీ అనుసంధానించడంతోపాటు... హ్యూమన్ టచ్ కూడా ముఖ్యమని వ్యాఖ్యానించారు. 24 గంటల్లోపు ఈ-ఫైల్స్ డిస్పోజ్ చేసేలా మంత్రులు, అధికారులు శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరి పనితీరును ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉన్నామని వెల్లడించారు. జిల్లాల్లో ఇ-ఆఫీస్ ద్వారా లేని ఫైల్స్ ఎన్ని ఉన్నాయో గుర్తించాలని సూచించారు. జిల్లా స్థాయిలో హెచ్ఓడీలు తప్పనిసరిగా ఈ-ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు సేవలందించే విషయంలో, మరింత మెరుగైన పాలనకు కలెక్టర్లు వినూత్నంగా ఆలోచించాలన్నారు. క్లియరెన్స్ రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి రావడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. క్లియరెన్స్‌లో వేగంగా ఉన్న మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, సెక్రటరీలను సీఎం అభినందించారు. పెద్దమొత్తంలో ఫైళ్ల వచ్చినా సరాసరి 10 గంటల వ్యవధిలో డిస్పోజ్ చేసిన సీఎస్ సాయి ప్రసాద్‌కు సీఎం అభినందనలు తెలిపారు. అవేర్ సహా వాట్సాప్ గవర్నెన్సు వినియోగంపై కలెక్టర్లకు సీఎం సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలన్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎంత టైమ్ వృధా అవుతుందో ఆలోచించాలని అన్నారు. ఇప్పటికే 29 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చామని.. 90 శాతం ప్రభుత్వ సేవలు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్ నాటికి అన్ని సేవలను వాట్సాప్‌లో అందించేలా చూడాలని ఆదేశించారు. మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సాప్ వినియోగాన్ని వివరించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. పిడుగుల హెచ్చరికలను జారీ చేయటంలో ఇంకా పర్ఫెక్షన్ రావాలన్నారు. తుఫాన్ల హెచ్చరికల సమయంలో నేరుగా మొబైళ్లకే మెసేజ్‌లు పంపించాలని తెలిపారు. తుఫాన్ల హెచ్చరికలను స్వర్ణ గ్రామ, వార్డుల ద్వారా కూడా పంపించాలని అన్నారు. సీవీడ్ సాగుపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు. అవేర్ సహా వాట్సాప్ గవర్నెన్సు వినియోగంపై కలెక్టర్లకు సీఎం సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలన్నారు. ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదని తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందని సూచించారు. మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సాప్ వినియోగాన్ని వివరించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు.అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు.

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమాచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపూర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006-09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపూర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్-2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

# సోనార్ బంగ్లా కోసం కృషి

చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా క్లళెం వేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బీజేపీ కార్యకర్తలందరి బాధ్యత అన్నారు. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు. బెంగాల్ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షిచేందుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్‌షా శుక్రవారంనాడు హాజరయ్యారు. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సువేందు అధికారిని బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. ఈనెల 9వ తేదీన కోల్‌కతాలోని బ్రిగేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... కమ్యూనిస్ట్ పాలన నుంచి బెంగాల్‌లో భయం, హింసాత్మక వాతావరణం ఉందని, ఇది ఆ తర్వాత తీవ్రంగా మారిందని అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో బెంగాల్ ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని అన్నారు. ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా 'సోనార్ బంగ్లా' లక్ష్యంతో ముందుకు సాగుతామని చెప్పారు. బెంగాల్ భయం రహిత సమాజం దిశగా వెళ్తుందని అన్నారు. గత 5 దశాబ్దాలుగా బెంగాల్ శాంతిభద్రతలు, ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ పరంగా తీవ్రమైన ప్రతికూల రాజకీయాలను చూసిందని.. బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఇప్పుడు బీజేపీ బాధ్యత అని అన్నారు. బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేస్తూ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శ్రీ అరబిందో, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కోరుకున్న బెంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని అన్నారు. ఈ విజయం చాలా ముఖ్యమైందని, 1950లో ప్రారంభమైన సైద్ధాంతిక ప్రయాణం నేడు బెంగాల్‌కు చేరుకుందని, శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మస్థలంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరుతుండటం ఒక చారిత్రక ఘట్టమని చెప్పారు. 2014లో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం ఇప్పుడు గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు చేరిందని ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకు బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయని చెప్పారు. ఈ విజయం కోసం 321 మంది బీజేపీ కార్యకర్తలు తమ ప్రాణాలను కోల్పోయారని, ఈ విజయం సులభంగా రాలేదని అమిత్ షా వెల్లడివంచారు. త్రిపుర, అస్సాం, బెంగాల్‌లలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడటంతో సరిహద్దు భద్రతను మరింత పెరుగుతుందని, అక్రమ రవాణా, చొరబాట్లను కఠినంగా అణిచివేస్తామని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా చొరబాటుదారుల్ని గుర్తించి వారిని తరిమివేసి, చొరబాటురహిత దేశంగా మారుస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మమతా బెనర్జీని ఆమె సొంత ఇంటిలో భవానీపూర్‌లో ఓడించి శక్తివంతమైన సందేశాన్ని పంపినట్లు అమిత్ షా చెప్పారు. ఈ విజయంతో బీజేపీపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హింస, కక్షపూరిత రాజకీయాలకు తావు ఉండకూడదని కార్యకర్తల్ని కోరారు. ఉదయం కోల్‌కతా చేరుకున్న అమిత్ షా ప్రఖ్యాత దక్షిణెశ్వర్ కాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సేవల పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్దం

# కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు విమర్శలు మానితే మంచిది

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మే8 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు. గవర్నర్ చర్యలను బిజెపికి అంటగట్టి విమర్శించడం మానుకోవాలన్నారు.

# కిడ్నీ రోగులకు అండగా ప్రభుత్వం

చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా వీటి నిర్వహణ చేపడతాయని తెలిపారు.ఇప్పటికే కూటమి పాలనలో 12 దయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. అదనపు దయాలసిస్ కేంద్రాలతో కలిపి మొత్తం 73 కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారికి అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లో 61 కేంద్రాలు నడుస్తున్నాయని వివరించారు. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు వస్తున్నాయని తెలిపారు. కొత్త కేంద్రాల రాకతో దూర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకునే రోగులకు అవస్థలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఐదేళ్లకు కలిపి సుమారు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వివరించారు. ఇక ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2,721పైగా డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారు.

# కేరళం సిఎం రేసులో కెసి వేణుగోపాల్

## పార్టీ అధ్యక్షుడికి పరిశీలకుల నివేదిక

న్యూఢిల్లీ,మే8 .: కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఈ రేసులో లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ ముందున్నారని తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ నివేదికను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించినట్టు పార్టీ వర్గాలు శుక్రవారంనాడు తెలిపాయి. పార్టీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమి భాగస్వాములు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. సీఎం అభ్యర్థుల రేసులో కేసీ వేణుగోపాల్‌తో పాటు గత అసెంబ్లీలో విపక్ష నేత వీడి సతీశన్, వెటన్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల పోటీ పడ్డారు. అయితే పార్టీ అధిష్టానానికి అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న 63 ఏళ్ల కేసీ వేణుగోపాల్ ముందు వరుసలో ఉన్నట్టు చెబుతున్నారు. ఆయనను తదుపరి సీఎంగా అధిష్టానం ప్రకటిస్తే ఎంపీ స్థానానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుంది.

# కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

### ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలసి పర్యటన

### ముంపు ప్రాంతాలను గుర్తించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్,మే8 : రాజధానిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలే ట్రాఫిక్, ఉప్పొంగే డ్రైనేజీలు.. తెరుచుకుని ఉండే మ్యాన్ హోల్స్ వెరసి వాహనదారులకు నరకప్రాయంగా ఉంటుంది. ఇక కృష్ణానగర్ నగర్ గురించి ఎంత చెప్పినా తక్కువే... చిన్నపాటి వర్షానికే రోడ్ల మీద డ్రైనేజీ ఉప్పొంగి ప్రవహిస్తూ వరదను తలపిస్తుంటుంది. ఈ క్రమంలో కృష్ణానగర్ వరద సమస్యపై హైడ్రా ఫోకస్ పెట్టింది. కృష్ణానగర్ వరద సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కృష్ణానగర్‌లో కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం చేసింది హైడ్రా. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి పనులను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల వరద కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు అధికారులు. నాలాల్లో డీసిల్టింగ్ పనుల్లో జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా భాగస్వామ్యం వహిస్తోంది. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వచ్చే మట్టి కారణంగా సమస్య తీవ్రత పెరుగుతోందని అంటున్నారు అధికారులు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు చర్యలు చేపట్టామని అన్నారు. కృష్ణానగర్ వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యామ్నాయ వరద కాలువ నిర్మాణంపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని..8 నుంచి 9 అడుగుల లోతున్న కాలువల్లో 6 నుంచి 7 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని తెలిపారు అధికారులు. అవసరమైతే స్లాబులు తొలగించి పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తామని స్పష్టం చేశారు కమిషనర్ రంగనాథ్. నాలాపై నిర్మించిన ఒకటి రెండు ఇళ్లను గుర్తించామని... తప్పనిసరి పరిస్థితి వస్తేనే తొలగింపు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇళ్ల ఖాళీ చేయించటానికి ముందు నోటీసులు, తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు కమిషనర్ రంగనాథ్. 2021 తర్వాత పూర్తి స్థాయిలో పూడిక తీత పనులు జరగలేదని అంటున్నారు స్థానికులు. గతేడాది వర్షాకాలంలో హైడ్రా మెట్ టీమ్స్ కొంత మేర పూడిక తొలగించారని..ఈసారి వేసవిలోనే పనులు ప్రారంభించి వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు కమిషనర్. స్లాబులు తొలగించిన ప్రాంతాల్లో బలమైన గ్రిల్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు కమిషనర్ రంగనాథ్.

# సిరిసిల్ల జిల్లాలో కెటిఆర్ పర్యటన

### ముల్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజన్న సిరిసిల్ల,మే8 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సిరిసిల్లా జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ముత్యాల పోచమ్మ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి పేట మండలంలోని నారాయణపూర్, రాగట్ల ప్లలె లో పెద్దమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దుమాలలోని శ్రీదేవి, భూ దేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్థిర ప్రతిష్ట మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ త్వరగా వానలు కురవాలి. పంటలు బాగా పండాలి. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు బాగుండాలి. గ్రామాలు బాగుంటేనే దేశం రాష్ట్రం బాగుంటుందని అన్నారు వీర్నపల్లి మండలం భావిసింగ్ భూక్యా తండాకు చేరుకున్న మాజీ మంత్రి కేటీఆర్ జగదాంబ మాత సేవ లాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు.

# మూసీ నిర్వాసితులకు డిప్యూటీ సీఎం భరోసా

### మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ

### మూసీ నది పునర్జీవనానికి సహకరించాలని వినతి

హైదరాబాద్,మే8 : మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా తగిన సాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మూసీ పునర్జీవన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మధుపార్క్ రిడ్జ (బి–బ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నిర్వాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ బి–బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చదనం అందించేందుకు చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని డిప్యూటి సీఎం కోరారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# ప్రాణహితపై ప్రధానికి వివరించండి

### వికసిత భారత్‌లో ప్రాజెక్టును పరిశీలించండి

### బిజెపి ప్రజాప్రతినిధులు మోడీకి వివరించాలి

### ప్రాజెక్టుకు కేంద్రం సంపూర్ణ సహకారం ఇవ్వాలి

### తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు



కొమురం భీం,మే8 : ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. నాటు పడవలపై నదీ ప్రవాహాన్ని మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, వికసిత్ భారత్ అని చెప్పుకునే కేంద్రం ఈ ప్రాజెక్టు విషయంలో పెద్ద మనసు చాటుకోవాలని కోరారు. బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్క యూనిట్ కరెంటు కూడా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని తరలించే ఈ బృహత్తర కార్యాన్ని పూర్తి చేస్తామని, ఈ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకుని సహకరించాలని మంత్రి జూపల్లి కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మూడు జిల్లాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని అన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎల్లుండి(మే 10) తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ పెద్దమనసుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సాగునీటి రంగంలో గ్రావిటీ ద్వారా నీటిని అందించే గొప్ప అవకాశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని ఆయన విమర్శించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ, 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. డా. బీఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. రూ. 38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. 106 కిలోమీటర్ల కాలువ పనులకు గానూ ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయ్యి, 46 కిలోమీటర్ల మేర పనులు కూడా జరిగాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఆర్థిక భారం మోపిందని మండిపడ్డారు. గ్రావిటీ ద్వారా వెళ్లాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోయడం వల్ల అంచనా వ్యయం గణనీయంగా పెరిగిందని మంత్రి వివరించారు. దీనివల్ల రాష్ట్రంపై భారీగా ఆర్థిక భారం పడటమే కాకుండా, కరెంట్ బిల్లులు కూడా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది తలాపునే ఉన్న సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ నీటిని వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృత నిశ్చయంతో ఉందని జూపల్లి తెలిపారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతాం. దీనివల్ల మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదు. భూములు నష్టపోయిన వారికి పరిహారం ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ ప్రాజెక్టు వల్ల రెండు రాష్టాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రాణహిత ప్రాజెక్ట్ మరుగున పడటానికి కారణం మాజీ సీఎం కేసీఆర్ అని మంత్రి వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ.లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. ప్రాణహిత ప్రాజెక్ట్ కూడా నిర్మిస్తామని ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టారని వ్యాఖ్యానించారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా సహకరించాలని మంత్రి వివేక్ కోరారు.

# యువకుడి దారుణ హత్యతో ఉద్రిక్తత

### యువతి ఇంటి ముందు తల్లిదండ్రుల ఆందోళన

### హంతకులను పట్టుకుంటామన్న పోలీసులు

హైదరాబాద్,మే8 : సికింద్రాబాద్ చిలకలగూడలో ఓ యువకుడి దారుణ హత్య ఉద్రిక్తతలకు దారి తీసింది. బీటెక్ విద్యార్థి యువన్‌ను కొందరు దారుణంగా చంపేశారు. ఈ హత్యకు ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. యువతి ఇంటి వద్ద యువన్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. నిందితులను తమకు అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. యువతి కుటుంబ సభ్యులే యువన్‌పై దాడి చేసి, కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపేశారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. యువతి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించారు. మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. గురువారం యువన్ తన స్నేహితులతో కలిసి చిలకలగూడలో ఓ ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం కత్తులతో, మారుణాయుధాలతో యువన్‌పై దాడి చేశారు. తల, గొంతు, శరీరభాగాల్లో తీవ్రమైన కత్తిపోట్లు కావడంతో యువన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈరోజు(శుక్రవారం) ఉదయం యువన్ కుటుంబసభ్యులు యువతి ఇంటి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, నిందితులను అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. యువన్ హత్యకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ నరసయ్య మీడియాకు తెలియజేశారు. 'రాత్రి 8:30 గంటల సమయంలో యువన్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ప్రేమ వ్యవహారం హత్యకు కారణంగా ప్రాథమికంగా తెలుస్తోంది. మృతుడి కుటుంబం గతంలో సీతాఫల్‌మండిలో ఉండేది. ఆ సమయంలోనే యువతి, యువన్‌కు మధ్య ప్రేమ మొదలైంది. జవహర్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రావడంతో నాలుగు నెలల క్రితం అక్కడికి యువకుడి కుటుంబం షిఫ్ట్ అయ్యింది. గతరాత్రి స్నేహితులతో కలిసి యువన్ మ్యాచ్ చూస్తున్న సమయంలో ఒక్కసారిగా దాడి చేశారు. యువన్‌కు తీవ్రమైన కత్తిపోట్లు అయ్యాయి. ఆస్పత్రికి తరలించాక మరణించాడు. హత్యలో పరమేశ్ అనే వ్యక్తితో పాటు మరో ఐదు మంది పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. త్వరలో నిందితులను అరెస్ట్ చేస్తాం. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం. నిందితులకు డ్రగ్స్ అలవాటు ఉందా లేదా అని పరీక్షలు చేస్తాం. ఇప్పటికీ మృతుడు, ప్రేమించిన యువతి మాట్లాడుకుంటున్నారా? లేదా అని తెలియాల్సి ఉంది. హత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం. గతంలో నిందితులపై కేసులు గురించి ఆరా తీస్తాం. ఈ కేసులో అమ్మాయి ప్రమేయం, ఫోన్ సంభాషణలపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. కుటుంబ సభ్యులు ఎలాంటి అపోహలకు పోవద్దు.. న్యాయం చేస్తాం' అని నరసయ్య పేర్కొన్నారు.

# తెలంగాణలో వైభవంగా రైతు వారోత్సవాలు

### రైతు సంక్షేమం,ఆధునిక వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

### నేడు చెరువుల్లో కంపచెట్ల తొలగింపు కార్యక్రమం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'రైతు వారం' కార్యక్రమాలు ఘన విజయవంతంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. మే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్రవ్యాప్తంగా 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 1,32,423 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. మే 5న హనుమకొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , కొండ సురేఖఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,779 మంది రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర, మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు. మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. 45,901 మంది రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. మే 8న నిర్వహించిన మండల స్థాయి సమావేశాల్లో పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, చెరువుల నిర్వహణ, చేపల ఉత్పత్తి పెంపు, కాలువల మరమ్మతులు, గేట్ల నిర్వహణ వంటి అంశాలపై కార్యాచరణ వివరించారు. రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొన్న వ్యవసాయ శాఖమాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వారికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించడం జరిగింది.

# అధ్వాన్నంగా శాంతిభద్రతలు

### కరీంనగర్ ఘటనలో బండిపై కేసులు పెట్టండి

### డిజిపిని కలిసి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు

హైదరాబాద్ : రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజేపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజ్ శ్రవణ్, దేశపతి శ్రీనివాస్ కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారని బీజేపీ నాయకులపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డికి సెక్యూరిటీ పెంచాలని, దాడులను ప్రోత్సహించిన బండి సంజయ్ మీద కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలపై, వారి ఇండ్లపై రౌడీలతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే ఆయన కార్యకర్తలు దాడి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద బండి సంజయ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడిండని దుయ్యబట్టారు. ఆయన మాట్లాడిన భాషను తాము మాట్లాడదలచుకోలేదని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో గురువారం మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్‌పై దాడిని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ కొడుకువే నా అని కేటీఆర్‌ను ప్రశ్నించడం సరైందని కాదని కౌశిక్ రెడ్డి ప్రశ్నించినందుకే దాడులు చేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తంబాకు తింటాడని అన్నందుకే దాడులు చేస్తారా అని నిలదీశారు. కేంద్ర హోం సహాయ మంత్రిగా ఉండి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బండి సంజయ్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని భావిస్తున్నామని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు. బండి సంజయ్, ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు.. వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి. అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం' అని వివేకానంద గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వెనుకబడిన రాష్ట్రాల్లో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో ఉందన్నారు. నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరించినట్లు తెలిపారు. నిన్న కౌశిక్ రెడ్డిని చంపాలని వచ్చారన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే కార్యకర్తలు వచ్చారని.. ఆయనపై కేసు నమోదు చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మతం పేరు చెప్పి రెచ్చగొట్టడం తప్ప ఆయన వల్ల ప్రజలకు రూపాయి లాభం లేదని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ పై అనవసరంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.

# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

### మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి

### స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది

### కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్,మే8 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి – ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశర చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ –1 సుమారు 7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చు కునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ –1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ఫ్లా÷ల్గ÷లింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్–టు–వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి –గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు.

# సంపాదకీయం

## మ్యాజిక్ ఫిగర్ లేకపోవడం గవర్నర్ తప్పా?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టాలు, శాసనసభ, లోక్‌సభ అంటే తెలియని వారంతా..ఇప్పుడు చట్టసభలకు ఎన్నికవుతున్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఉన్న వెసలుబాటు కారణంగా ఎవ్వరైనా చట్టసభలకు ఎన్నిక కావచ్చు. ఎన్నికయ్యాక అయినా చట్టాలు, రాజ్యాంగ గురించి తెలుసుకుంటే బాగుండేది. కానీ అలా జరగడం లేదు. డబ్బులు, పలుకుబడి, మందబలం ఉంటే ప్రజాప్రతినిధులు అవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఏమీ తెలియకండా బయట ఉండేవారు చట్టాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడేస్తున్నారు. తమిళనాడు విషయంలో ఇదే జరుగుతోంది. టివికె పార్టీ పార్టీ పెట్టి,108 సీట్లు నెగ్గి, అత్యధిక మెజార్టీ సీట్లతో విజయ్ ముందున్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు ఉండాలి. కేవలం అందరికన్నా మెజార్టీ సాధిస్తే లేదా అతిపెద్ద పార్టీగా అవతరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రూల్ ఏమీ లేదు. 118 సీట్లకు సంబంధించి మద్దతు పత్రాలను సమర్పించాలని గవర్నర్ విశ్వనాథ్ కర్లేకర్ కోరడంలో కూడా వింతేమీ లేదు. మద్దతు ఉందని తెలిస్తే తప్పకుండా ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాల్సిందే. అలా కాకుండా అతిపెద్ద పార్టీగా గెలిచాం కనుక ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలని గవర్నర్‌ను డిమాండ్ చేయడం సరికాదు. అలాగే గవర్నర్‌ను నిందించడం అంతకన్నా సరికాదు. అందుకే చట్టం, రాజ్యాగం తెలియని నటులు ప్రకాశ్ రాజ్, విశాల్, కాంగ్రెస్ నేతలు గవర్నర్ తీరును తప్పు పడుతున్నారు. వీరంతా బిజెపి వ్యతిరేకులు కనుక గవర్నర్‌ను తప్పు పడుతున్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇలా మద్దతు ఉన్నా లేకున్నా ప్రభుత్వాల ఏర్పాటుకు పిలిచి, బొక్కబోర్లా పడ్డ సంఘటనలు ఉన్నాయి. అలాగే హార్స్ ట్రేడింగ్ జరగడం చూశాం. కాబట్టి గవర్నర్ అనుసరించిన విధానమే రాజ్యాంగబద్ధం. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు రోజులు కావస్తున్నా.. వ్యవహారం ముందుకు కదలడం లేదు. టివికె అధినేత విజయ్‌కు మద్దతు ఇచ్చే వారు లేఖలు సమర్పించి ఉంటే ఈ పంచాయితీ రాదు. తమిళనాడు రాజకీయం రసకందాయంలో పడడానికి హంగ్ ఏర్పడడమే ప్రధాన కారణం. అలాగే గట్టిగా ఏ ఒక్క పార్టీ కూడా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించలేదు. ఐదు సీట్లు కాంగ్రెస్ మాత్రమే ప్రకటించింది. అదికూడా మద్దతు లేఖ సమర్పించలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ, కూటమికి మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన ఏర్పడింది. దీనికి గవర్నర్ తప్పు కాదు.ఆయన బిజెపి మనిషి కనుక ఇలా చేశారని అనేవాళ్లు మూర్ఖులు తప్ప మరొకరు కాదు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో సినీ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో గెలిచి మెజారిటీకి కాస్త దూరంలో నిలిచి పోయారు. స్టాలిన్ నాయకత్వం లోని డీఎంకే కూటమి 73 స్థానాలకు పరిమితం కాగా, పళనిస్వామి నేతృత్వంలోని అన్నా డీఎంకే కూటమి 53 స్థానాలు గెలుచుకున్నది. ఈ మూడింటిలో ఏవో రెండు పార్టీలు కలిస్తే తప్ప ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం లేదు. ఎవరికి వారే భీష్మించుకొని కూర్చోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆగిపోయింది. గవర్నర్‌ను విజయ్ సంప్రదించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించా లంటే మ్యాజిక్ ఫిగర్ సభ్యుల మద్దతు తప్పనిసరి అని గవర్నర్ స్పష్టంచేశారు. దీంతో తమిళనాడులో సీఎం పీఠం ఎవరిది అనే తీవ్ర ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొన్నది. బీహార్‌లో 2005 ఎన్నికల్లో జేడీయూ, ఆర్జేడీ, ఎల్‌జేపీలో ఏ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన నెలకొన్నది. తాము ఎవరికీ మద్దతిచ్చేది లేదని మూడు పార్టీల నేతలు భీష్మించుకున్నారు. విధి లేని పరిస్థితుల్లో గవర్నర్ బూటాసింగ్ రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. అసెంబ్లీ రద్దు చేశారు. వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. ప్రతిష్టంభన పేరుతో అసెంబ్లీని రద్దు చేయడం అప్రజాస్వామికమని సుప్రీంకోర్టు తప్పుపట్టింది కానీ అప్పటికే రద్దయిన అసెంబ్లీ పునరుద్ధరించలేదు. ఆరునెలలకే అసెంబ్లీ ఎన్నికలు జరిగి జేడీయూ అధికారంలోకి వచ్చింది. సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం గవర్నర్ తొలుత మెజారిటీ సాధించిన పార్టీకి లేదా ప్రీపోల్ సంకీర్ణానికి అవకాశం ఇవ్వాలి. లేదా ఎన్నికల తర్వాత ఏర్పడ్డ సంకీర్ణానికి అవకాశం ఇచ్చి బలపరీక్షకు పురమాయిం చాలి. సర్వసాధారణంగా జరుగుతున్న తంతు ఇదే. ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాని సందర్భంలో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆహ్వానించ వచ్చునా లేదా అన్న విషయంలో మాత్రం గవర్నర్లు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. అలా తీసుకున్న సందర్భం లో విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఇలా గోవా, కర్నాటక, మహారాష్ట్రల్లో తలబొప్పి కట్టిన సంఘటనలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 నిబంధన ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులను నియమిస్తారు. గవర్నర్ అభీష్టం ఉన్నంతకాలం వారు పదవిలో ఉంటారు. ఈ మేరకు గవర్నర్‌లు అంతా ఒకే రీతిన వ్యవహరించారు. కానీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే ముందుగా ఎవరిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలన్న విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. అక్కడే గవర్నర్ల విచక్షణాధికారం చట్టాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు చూశాం. రాజకీయ నేతలను గవర్నర్లుగా నియమించడం మొదలయ్యాక విచక్షణాధికారం ఆయా పార్టీల విధానాలకు అనుగుణంగా మారింది. ఇలాంటి దుష్ట సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టింది. బిజెపి కొనసాగిస్తోంది. అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలా వద్దా అనే విషయంలో ఒక స్పష్టత ఇస్తే తమిళనాడు వంటి వివాదాలు భవిష్యత్తులో తలెత్తవు. ఆ దిశగా కేంద్రం రాజ్యాంగ సవరణ చేస్తే మరీ మంచిది. డీఎంకే, అన్నాడీఎంకే కూటములు ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాని నేపథ్యంలో విజయ్‌కి గవర్నర్ అవకాశం ఇస్తే పెద్దగా అభ్యంతరాలు ఎందుకని చాలామంది ప్రశ్నిస్తున్నారు. కానీ ఇక్కడా గవర్నర్ తన పరిధి మేరకు, రాజ్యాంగ బద్ధంగానే మద్దతు లేఖలు కోరారు. అందులో తప్పుకూడా లేదు. తన బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని అడగడంతోనే అక్కడ మెలిక ఉంది. అధికారంలోకి వచ్చిన తరవాత ఓ పదిమంది ఎమ్మెల్యేలను కొనడం సులువు. అలాంటి ఉదాహరణలు కోకొల్లలు. కాబట్టి హార్స్ ట్రేడింగ్‌కు అవకాశం లేకుండా, నడుచుకోవాలన్న గవర్నర్ నిర్ణయం సమర్థనీయం. అన్నా డీఎంకే, డీఎంకేల్లో ఒకరు మద్దతిస్తే విజయ్ ముఖ్యమంత్రి కావచ్చు. లేదా డీఎంకే, అన్నా డీఎంకే కూటములు కలిస్తే కాంగ్రెస్, బీజేపీ సహకారం లేకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే 121 సీట్ల బలం వారికి ఉన్నది. ఈ క్రమంలో గవర్నర్‌ను విమర్శించే వారు చట్టాలను, రాజ్యాంగాన్ని తెలుసుకుంటే మంచిది. మరీ ముఖ్యంగా సినిమా నటులకు ఇది వర్తిస్తుంది.

# ప్రజాస్వామ్య విలువలపై దీదీ 'ధిక్కార' నీడ!



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకున్న తాజా నిర్ణయం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాల్సింది పోయి, 'నేను దిగిపోను.. చేతనైతే గవర్నరే నన్ను బర్తరఫ్ చేయాలి' అని వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం, ఒక ప్రభుత్వం అధికారంలో ఉండాలంటే దానికి శాసనసభలో మెజారిటీ ఉండాలి. అంతకంటే ముఖ్యంగా, ఆ ప్రభుత్వానికి నాయకత్వం వహించే వ్యక్తి ఎన్నికలద్వారా ప్రజల మద్దతును పొంది ఉండాలి. 'ప్రజాస్వామ్యంలో అధికారం అనేది శాశ్వతం కాదు. ప్రజలతీర్పును శిరసావహించడం నాయకుడి కనీస బాధ్యత. బర్తరఫ్ చేయమని కోరడంద్వారా మమతా బెనర్జీ రాజకీయ లబ్ధి కోసం 'విక్టిమ్ కార్డ్' (బాధితురాలిగా చూపించుకోవడం) ప్లే చేస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ ఈసారి మమతా బెనర్జీ వైఖరి రాజ్యాంగ పరిమితులను దాటినట్లు కనిపిస్తోంది. పదవి కంటే ప్రజాస్వామ్య విలువలు గొప్పవని గుర్తించాల్సిన బాధ్యత ఒక ప్రజానాయకురాలిగా ఆమెపై ఉంది. ధిక్కార స్వరం వినిపించడం తాత్కాలికంగా రాజకీయంగా కలిసి రావచ్చు ఏమో కానీ, చరిత్రలో అది ఒక 'కళంకం'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రతి ఏటా ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా దుస్తులు పంపించే దీదీ మమతా బెనర్జీ.. రాజకీయంగా మోడీని విభేదించడం ఎవరికైనా ఆశ్చర్యం కలగపోవచ్చు. కానీ మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆమె ఇటువంటి ప్రజాస్వామ్య ధిక్కార స్వరాన్ని వినిపించడం నిజంగా ఆశ్చర్యకమే! మీడియా నైతికతకు మారుపేరు భారత రాజకీయ చరిత్రలో మహిళల పాత్ర క్రమంగా విస్తరించుకుంటూ వచ్చినప్పటికీ, ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్న మహిళలు ఇప్పటికీ అరుదుగానే కనిపిస్తారు. అయినా, తమ నాయకత్వంతో కొన్ని రాష్ట్రాల రాజకీయ దిశను ప్రభావితం చేసిన కొంతమంది మహిళా ముఖ్యమంత్రులు భారత ప్రజాస్వామ్యానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. మరికొంత మంది అవినీతి పంకిలంలో కూరుకుపోయారు. వారి విజయాలు, వైఫల్యాలు గమనార్హమే! స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు సుమారు 17 మంది మహిళలు వివిధ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా సేవలందించారు. వీరిలో కొందరు సుదీర్ఘకాలం పాలించి రికార్డులు సృష్టించగా, మరికొందరు స్వల్ప కాలానికే పరిమితమయ్యారు. తర్వాతి కాలంలో జయలలిత తమిళనాడు రాజకీయాల్లో అత్యంత ప్రభావశీల నాయకురాలిగా ఎదిగారు. ఆరుసార్లు సిఎంగా సేవలందించి అమ్మగా ప్రజల్లో గుర్తింపు పొందిన ఆమె పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. అక్రమాస్తుల కేసుల్లో జైలుశిక్ష అనుభవించడం ఆమె రాజకీయ జీవితంపై మచ్చ వేసాయి. కొత్త ఆశలు, సరికొత్త సవాళ్లు ఇదే సమయంలో మాయావతి దళిత రాజకీయాలకు కొత్త దిశను చూపించారు. మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్లో మూడు దశాబ్దాల కమ్యూనిస్ట్ పాలనకు ముగింపు పలికి చరిత్ర సృష్టించించారు. ప్రజాసంక్షేమ పథకాలతో ప్రజాదరణ పొందిన ఆమెపై కూడా రాజకీయ హింస, పరిపాలనా లోపాలపై విమర్శలు ఉన్నాయి. శారదా చిట్ ఫండ్ వంటి కుంభకోణాలు, ఇటీవల ఆర్.జి కర్ హాస్పిటల్ ఘటన వంటి పరిణామాలు ఆమె పాలనకు అడ్డుకట్టవేశాయి. దేశంలో అత్యధిక కాలం సుమారు 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన మహిళ షీలాదీక్షిత్ ఢిల్లీ నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. మౌలిక సదుపాయాల విస్తరణలో ఆమె కృషి గుర్తింపు పొందినా, అవినీతి ఆరోపణలు ఆమె పాలనపై ప్రభావం చూపాయి. రాజస్థాన్‌లో వసుంధరా రాజే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, అంతర్గత పార్టీ విభేదాలు, ప్రజా అసంతృప్తి ఆమెకు సవాళ్లుగా మారాయి. గుజరాత్‌లో ఆనంది బెన్ పటేల్ గుజరాత్‌లో పరిపాలన కొనసాగించినప్పటికీ, పటిదార్ ఆందోళనలు ఆమె పదవీ కాలాన్ని కుదించారు. మెహబూబా ముఫ్తీ జమ్మూకశ్మీర్ తొలి మహిళా ముఖ్యమంత్రిగా నిలిచారు. ఢిల్లీ పీఠంపై ప్రస్తుతం రేఖ గుప్తా, అంతకుముందు అతిషి (ఆప్) ఢిల్లీ రాజకీయాల్లో కొత్త తరం మహిళా నాయకత్వానికి ప్రతినిధులుగా నిలుస్తున్నారు. భారతదేశ మహిళా ముఖ్యమంత్రుల చరిత్రను పరిశీలిస్తే కొన్ని కీలక అంశాలు కనిపిస్తాయి, చాలామంది మహిళా నేతలు ప్రత్యర్థుల కుట్రల వల్లనో లేదా అధికార వికేంద్రీకరణ లేకపోవడం వల్లనో అవినీతి కేసుల్లో ఇరుక్కున్నారు. వీటన్నింటికీ భిన్నంగా ఇప్పుడు మమత బెనర్జీ తన ఓటమిని అంగీకరించకుండా ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, కేంద్రంలోని బిజేపీని తిట్టిపోయడం ద్వారా అసహనాన్ని బయటపెట్టుకున్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం.

# టివికెను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలి

### ద్రవిడ పార్టీల కలయికపై సమాచారం లేదు

### డిఎంకె ఎంపి కనిమొళి వెల్లడి

చెన్నై,మే8 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు సాధించినా.. మెజార్టీ లేకపోవటంతో టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతోంది. దీన్ని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు అవకాశంగా మలుచు కోవాలని చూస్తున్నాయి. ఇరు పార్టీల అగ్రనేతలు దశాబ్దాల వైరాన్ని మరిచి పొత్తులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. శు క్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించాలి. ప్రజల తీర్పే సర్వోన్నతమైనది. దానిని గౌరవించాలి. దురదృష్టవశాత్తు ఎవరికీ మెజారిటీ లేదు. నేను ఊహాగానాలకు సమాధానం ఇవ్వలేనని అన్నారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ.. టీవీకేకు మద్దతు ఇవ్వటంపై కనిమొళి స్పందించారు. మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కనిమొళి మాట్లాడుతూ.. కాంగ్రెస్-డీఎంకే చాలా ఎన్నికల్లో కలిసి పనిచేశాయని తెలిపారు. తాజా ఎన్నికల్లో కూడా కలిసి పోటీచేసి ఓటమి చవిచూశాయన్నారు. ప్రతి పార్టీకి తమకు ఏదైతే సరైనదని అనిపిస్తుందో అది చేసే హక్కు ఉంటుందన్నారు. ఇతరుల గురించి తాను చెప్పేది ఏమీ లేదని, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. అన్నాడీఎంకే పార్టీకి మద్దతు ఇవ్వడానికి డీఎంకే సిద్ధంగా ఉంది. మద్దతు కావాలంటే బీజేపీతో అన్నాడీఎంకే పొత్తును రద్దు చేసుకోవాలని డీఎంకే షరతు పెట్టింది. అంతేకాదు.. తమతో పాటు కలిసే చిన్న పార్టీలకు కూడా మంత్రి పదవులు ఇవ్వాలని అంటోంది. ఇదిలావుంటే కాంగ్రెస్ తీరును డీఎంకే ఎమ్మెల్యే సమావేశం ఖండించింది. తేనాంపే÷-టలైలోని అన్నా అరివాలయంలో డీఎంకే ఎమ్మెల్యే సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షతన గురువారం జరిగింది. శాసనసభ ఎన్నికల్లో డీఎంకే నాయకత్వంలోని లౌకివాద ప్రగతిశీల కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన కూటమి పార్టీలకు, ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఐదేళ్ల డీఎంకే హయాంలో తమిళనాడును పలు రంగాల్లో ముందంజలో నడిపించినందుకు స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తగిన నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఆయనకే అప్పగిస్తూ, కూటమికి ద్రోహం చేసి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ వైఖరిని ఖండిస్తూ తీర్మానాలు చేశారు.

# జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో దారుణం

### విశ్రాంత పోలీస్ అధికారి వినయ్ రంజన్ సతీమణి హత్య

### ఇంటి పనిమనిషి కల్పనే సూత్రధారి

హైదరాబాద్ : జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో దారుణ హత్య జరిగింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ (55) హత్యకు గురయ్యారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నివాసంలో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన పని మనిషి కల్పన ఈ హత్యలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసుల అనుమానం ప్రకారం, కల్పన మరో ముగ్గురితో కలిసి ముందస్తు ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తనూజ ఒంటరిగా ఉన్న విషయాన్ని తన గ్యాంగ్‌కు చెప్పిన కల్పన గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వారితో కలిసి హత్యకు పాల్పడినట్లు సమాచారం. హత్య అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకుని నిందితులు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా, 8 నెలలుగా ఆ ఇంట్లో కల్పన పని చేస్తోంది. మరోవైపు ఘటనాస్థలికి ఉన్నతాధికారులు చేరుకుని పరిశీలించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస ప్రాంతంలో హత్య జరగడం సంచలనంగా మారింది. హత్య విషయం తెలిసిన వెంటనే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇంటికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేరుకున్నారు. కాగా, వినయ్ రంజన్ రాయ్ ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.

# యువత మత్తుకు దూరంగా ఉండాలి


### టాలెంట్ ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి

### మెగా జాబ్‌మేళాలో మంత్రి సురేఖ

హనుమకొండ,మే8 : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానించారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకుని నిలబడాలని అన్నారు.

# ధ్యానయోగం.. దైవమార్గం

ఆలోచనా ప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీద గానీ, ఒక భావం మీద గానీ,అవిచ్ఛిన్నమైన తైలధారగా స్థిరంగా ఉంచగలిగితే దానిని 'ధ్యానం' అంటారు.ధ్యానమంటే మనసు లోతును కొలిచే సాధనంగా నిర్వచిస్తారు తాత్త్వికులు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగిఉన్న శక్తిని పరిశీలించటమే ధ్యాన లక్ష్యం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనసును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్ర మించే ఈ మనసు వెనుక ఉన్నది ఏమిటి? మనసును శోధించటం ద్వారా ఆలోచనలను పరిష్కరించటం, సమాధానపరచటం.. ఇదే ధ్యానం. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయిని అందుకున్నప్పుడు ఈ మనసు మనం అనుకున్నంత చెడ్డదేమీ కాదని అవగతమవుతుంది. ధ్యానం సిద్ధించినప్పుడు మనసు నుంచి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనసు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. 'ధ్యానం చేసేవారికి దేహాభిమానం తొలగుతుంది. భగవంతుని సాక్షాత్కారం కలుగుతుంది. ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు' అంటోంది వేదాంత పంచదశి. హృదయంలో బొటనవేలు పరిమాణంలో ఆత్మ ఉందని కఠోపనిషత్తు చెబుతుంది. నిరాకార నిర్గుణ పరమాత్మ ధ్యానం ఈ హృదయంలో చేయాలి. ఈ హృదయాకాశంలో జ్యోతిని పరమాత్మగానూ, ఆ జ్యోతి మధ్యలో ఉన్న చిన్న జ్యోతిని తన ఆత్మగానూ ధ్యానించాలని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. అలాంటి మహాత్ములు ఆత్మ, పరమాత్మలు ఒకటని చెప్పారు. అందుకే ఏకత్వాన్ని ధ్యానించాలి. హృదయాకాశంలో ద్వాదశ దళాల కమలంపై ఇష్టదేవత చిన్మయమూర్తి ఆసీనుడై ఉన్నట్లుగా భావించి ధ్యానించాలి.



ఆధ్యాత్మికం

# ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

- గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, రవాణా వాహనాలు అందుబాటులో ఉంచాలి
- రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలి
- జిల్లాలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను తనిఖీ చేసిన - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం, కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం, ఓదెల మండలంలోని పోత్కపల్లి, ఓదెల మండల కేంద్రం, సుల్తానాబాద్ మండలంలోని రేగడి మధికుంట గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.అలాగే సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలోని జై హనుమాన్ రైస్ మిల్, సాంబశివ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కనకమహాలక్ష్మి రైస్ మిల్, సుగ్లంపల్లి గ్రామంలోని లక్ష్మీ భవాని రైస్ మిల్లులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి ఆలస్యం లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని సూచించారు.రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం స్వీకరించాలని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత జనగణన -2027 విజయవంతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- నగర మేయర్ కోలగాని శ్రీనివాస్






**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** భారత జనగణన--2027 దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, దీని విజయవంతానికి ప్రతి పౌరుడు బాధ్యతగా భాగస్వామి కావాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జనగణన అవగాహన ర్యాలీని మేయర్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. అనంతరం నగరంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, విద్య, వైద్యం, ఉపాధి వంటి అనేక రంగాల్లో ప్రభుత్వ నిర్ణయాలకు జనగణన ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా అందించి ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.జనగణన ద్వారా ప్రజల అవసరాలను సమగ్రంగా అంచనా వేసి, వాటికి అనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఖచ్చితమైన జనాభా గణాంకాలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది జనగణనపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు.జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించి, సరైన సమాచారాన్ని ఇవ్వాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుడా చైర్మన్, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కార్పొరేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరీంనగర్ నగరాభివృద్ధికి రూ.35 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు



మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన



**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరాన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు నగర దీలక ఠంఙ్ఞ కట్టుబడి పనిఛ్ఖళఖిందని చీన్నాఘ.శుక్రవారం కరీంనగర్ నగర పాలక సంస్థ 44వ డివిజన్ పరిధిలో మున్సిపల్ సాధారణ నిధులతో సుమారు రూ.35 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో కాలనీవాసులు నీటి నిల్వలు, మురుగునీటి సమస్యలతో ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలలో భాగంగా నగర వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.నగర అభివృద్ధిలో పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట వేస్తూ రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీటి వంటి ప్రాథమిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో కరీంనగర్‌ను పరిశుభ్రమైన, సుందరమైన, అభివృద్ధి చెందిన మోడల్ నగరంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని మేయర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సుద్దాల గ్రామంలో భక్తి శ్రద్ధలతో ముగిసిన అఖండ భజన



**సుల్తానాబాద్, మే 08(ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మండలం లోని సుద్దాల గ్రామ శివాంజనేయ దేవాలయంలో నిర్వహించిన అఖండ భజన కార్యక్రమం భక్తిభావంతో విజయవంతంగా ముగిసింది. ఈ నెల 7వ తేదీ ఉదయం 5:30 గంటలకు ప్రారంభమైన ఈ భజన, మరుసటి రోజు (8వ తేదీ) ఉదయం 5:30 గంటల వరకు నిరంతరాయంగా 24 గంటల పాటు కొనసాగింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం కూడా నిర్వహించారు. ఈ వేడుకలో ఆంజనేయ స్వామి మాలధారణ చేసిన దీక్షా పరులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన బృందాల కీర్తనలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

## ఘనంగా మాజీ మంత్రి గంగుల పుట్టినరోజు వేడుక




**తిమ్మాపూర్, మే8(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశం, పోరండ్ల సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పుట్టిన రోజు వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.సివిల్ సప్లై మాజీ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సల్ల మహేందర్, గట్టపల్లి దీపక్, తొర్తి ప్రశాంత్, సిల్ల పరశురాములు, ఎర్రం అనంతరెడ్డి, చిందం సంపత్,ముత్తమల్ల నిఖిల్,లంక రవి, రేషవేణి వేణు యాదవ్,వీర్ల అనిల్, యూసఫ్, సిరిసిల్ల రాజేందర్, బాబా, సిల్ల వినోద్, లంక సంపత్, లంక అన్వేష్, పున్నం అశోక్, వెంకటేశ, సంజీవ్, ఆకునూరి మనోహర్ తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

## రేపటి కరీంనగర్ బందుకు నగర ప్రజలు సహకరించాలి: ఎమ్మెల్యే గంగుల



**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్యన వైరుధ్యం ఉండొచ్చు, భేదాభిప్రాయాలు ఉండొచ్చు కానీ కరీంనగర్ చరిత్రలో ప్రప్రథమంగా నా క్యాంపు కార్యాలయం పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదేవిధంగా ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. నిన్నటి రోజు గురువారం నా క్యాంపు కార్యాలయం పై దాడి ఘటనను నిరసిస్తూ శనివారం రోజున కరీంనగర్ నగర బంద్‌కు పిలుపునిస్తున్నామని, ఈ బందుకు కరీంనగర్ నగర అన్ని వర్గాల ప్రజలతో పాటు, వ్యాపార వాణిజ్య సంస్థలు, బందుకు శాంతియుతంగా మద్దతు ఇవ్వాలని,ఈ బందుకు బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులందరూ శాంతి యుతంగా బంధులో పాల్గొని సహకరించాలి అని కోరారు.

## ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

### - మే 14 నుండి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ -ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఏటీసీలలో 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, కన్వీనర్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, టీసీ తదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మే 14, 2026 నుండి జూన్ 8, 2026 వరకు ద్వారా రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2026 ఆగస్టు1 నాటికి 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని, అభ్యర్థులు తమ సొంత మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఐటీఐ పూర్తి అయ్యే వరకు మార్చరాదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దయ్యే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

## హాలియాలో జనగణనకు శ్రీకారం

### - ఎన్యూమరేటర్లకు మెటీరియల్ కిట్ల పంపిణీ



**నల్గొండ ప్రతినిధి మే.08 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 11-05-2026 సోమవారం నుండి ప్రారంభం కానున్న జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గుర్తింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. జనగణన కార్యక్రమానికి అవసరమైన సెన్సస్ ఆఫ్ ఇండియా మెటీరియల్ కిట్లు అందుబాటులోకి రావడంతో, వాటిని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి , మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్, హాలియా మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ, మే 11 నుండి జూన్ 9 వరకు జరిగే జనగణన కార్యక్రమంలో హాలియా పట్టణ ప్రజలు తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగణన సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


## ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు





**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు పడాల రాహుల్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ సిటీ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ఆకుల ఉదయ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆకుల ఉదయ్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఎండీ సుఫియాన్ ఆకుల ఉదయ్ కి కేకు పెట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో కృప, విశాల్, శ్రావణ్, గజన్, ప్రవీణ్, ఇదయ్యద్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన సందర్భంగా అన్నదానం..



**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర రవాణా బిజీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్న ప్రభాకర్ జన్మదిన సందర్భంగా కట్టరాంపూర్ హనుమాన్ టెంపుల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య కార్పొరేటర్ ఆకుల నర్మదా ఆధ్వర్యంలో హనుమన్ స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ స్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆకుల నరసయ్య నర్మద హనుమాన్ భక్తులకు స్వయంగా వడ్డించారు. అదేవిధంగా హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమించిన సందర్భంగా ఆకుల నరసయ్య మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని సాధించాలి

● ధాన్యం కొనుగోళ్ల వేగాన్ని వెంటనే పెంచాలి ● హమాలీల సమస్య పరిష్కరించి లిఫ్టింగ్ వేగవంతం చేయాలి ● సమీకృత జిల్లా కలెక్టరేట్లో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రోజుకు 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్, ట్యాబ్ ఎంట్రీలు, కొనుగోలు కేంద్రాల పనితీరుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా ప్యాడీ లోడింగ్ పనుల ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్చార్జ్లు సమర్థవంతంగా పర్యవేక్షించడం లేదని గమనించినట్లు తెలిపారు. ఇకపై ప్రతి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం వేగంగా రైస్ మిల్లులకు చేరేలా సెంటర్ ఇన్చార్జ్లు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, కొనుగోళ్ల వేగాన్ని తక్షణమే పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గత సీజన్లో రోజుకు 14 నుండి 15 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోళ్లు జరిగాయని, ప్రస్తుతం రోజుకు కేవలం 8 వేల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు జరుగుతోందన్నారు. వెంటనే కొనుగోళ్ల వేగం పెంచి రోజుకు కనీసం 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో హమాలీల సంఖ్యను వెంటనే పెంచాలని, రేపటి నుండి రెట్టింపు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరగాలని తెలిపారు. ప్రతి కేంద్రం నుండి రోజువారీగా ఎక్కువ సంఖ్యలో వాహనాల ద్వారా ధాన్యం లిఫ్టింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియను తప్పనిసరిగా ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్చార్జ్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం వచ్చే వారం భారీ వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలు ప్రస్తుతం 80 శాతం వరకు మాత్రమే నమోదవుతున్నాయని, ఉదయం ఒక కేంద్రాన్ని సందర్శించినప్పుడు కేవలం 60 శాతం ఎంట్రీలు మాత్రమే నమోదై ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. ఈ పరిస్థితిని వెంటనే సరిచేసి ఈరోజే 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రెండో శనివారం, ఆదివారం రోజుల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తప్పనిసరిగా పని చేయాలని, ధాన్యం కొనుగోళ్లు నిరంతరంగా కొనసాగాలని తెలిపారు. కొనుగోళ్ల సమయంలో తప్పనిసరిగా ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు స్థానిక రైతుల ధాన్యానికే రైస్ మిల్లుల్లో ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడులు కూడా అధికంగా రావడంతో హమాలీల కొరత తలెత్తే అవకాశం ఉందని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా హమాలీలను సమీకరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీవో శ్రీమాల, డీసీఎస్ఓ శ్రీనాథ్, అడిషనల్ డీఆర్డీవో రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, రైస్ మిల్ నిర్వాహకులు, లారీ అసోసియేషన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులను వెన్నుపోటు పొడిచిన రేవంత్ సర్కార్..

● ఫీజు రియంబర్స్మెంట్ రద్దు చేసేందుకే జీవో 7.. ● ఫీజు రియంబర్స్మెంట్ నేరం.. ప్రభుత్వాన్నిదైతే శిక్ష విద్యార్థులకా. ● ఫీజు రియంబర్స్మెంట్ విషయంలో ప్రధాన దోషి ప్రభుత్వమే.. ● 10వేల కోట్ల ఫీజు బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు...




**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వం విద్యార్థుల బోధనా రుసుమును ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని పిజు రియంబర్స్మెంట్ రద్దు చేసేందుకు తీసుకువచ్చిన జీవో నెంబర్ 7 ఉపసహరించు కోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ,సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ కాసిం, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణలు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .స్థానిక శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో గిరిప్రసాద్ భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు ఆసరాగా నిలిచిన ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేయాలని ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆర్థిక స్తోమత లేని నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించే పథకాన్ని సమాధి చేసేలా విడుదల చేసిన చీకటి జీవో 7 ను ఉపసంహరించు కోవాలని వారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ కళాశాలకు ఫీజులు పెంచింది ఇది విద్యార్థులపై భారం పడుతుందనీ ఆ మేరకు ఫీజు రియంబర్స్మెంట్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఫీజ్ రీయింబర్స్ మెంట్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వనిదే కాని చెల్లింపులు విపరీతమైన ఆలస్యం చేయడం తో ప్రవేట్ విద్యా సంస్థల యాజమాన్యలు అనేక సార్లు నిరవధిక బందు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం అంటి అంటనట్టుగా వ్యవహరించడంతో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రవేట్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలుచేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజులు చెల్లించేది లేదని ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల పిజు రియాంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను తక్షణమే విడుదల చేయడం తో పాటు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ యధావిధిగా కొనసాగించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, కే వి పి ఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, డి హేచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఏసు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జగన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు గోకినపల్లి మస్తాన్, ఐసా జిల్లా కార్యదర్శి జిమ్మీ అశోక్, ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బసిరుద్దీన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మధు, పవన్, గోపి, శివ, చైతన్య, నరేందర్, ఉమా, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో రెచ్చిపోతున్న ఆకతాయిలు

**- సామాన్యుడిపై దాడి, అనంతరం స్థానికుల దెబ్బకు యువకులకు దేహశుద్ధి**



**కరీంనగర్ టౌన్, మే 8(ది క్రైమ్ న్యూస్):** నగరంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది మద్యం మత్తులో తూలుతూ, నిబంధనలు అతిక్రమిస్తూ రోడ్లపై తిరుగుతున్న కొందరు ఆకతాయిలు సామాన్యులను భయాందోళనకు గురిచేస్తున్నారు. తాజాగా భగత్ నగర్ చౌరస్తాలో చోటుచేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది. భగత్ నగర్ చౌరస్తాలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించే ఓ పేద కార్మికుడు, మంచినీళ్లు తాగేందుకు రోడ్డు దాటుతుండగా రేహన్, పర్హాన్ అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చారు. తనకు ప్రమాదం జరుగుతుందేమోనన్న భయంతో సదరు కార్మికుడు "నెమ్మదిగా వెళ్లండి" అని వారించగా ఆ యువకులు రెచ్చిపోయారు. వాహనాన్ని ఆపి, కార్మికుడిని అసభ్య పదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా చితకబాదారు. ఓ పేద కార్మికుడిపై అకారణంగా దాడి చేయడం చూసిన స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ప్రజలు వెంటనే స్పందించి ఆ ఇద్దరు యువకులను పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన చోట ప్రజలే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. హుజూరాబాద్ కౌశిక్ రెడ్డి పై దాడి ఘటన మరువక ముందే, 24 గంటలు గడవకముందే మరో సామాన్యుడిపై ఇద్దరు యువకులు దాడికి పాల్పడటం కరీంనగర్ జిల్లాలో చర్చనీయాంశమైంది. అసలు నగరంలో ఏం జరుగుతోందని, సామాన్యుడికి రక్షణ ఎక్కడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇలాంటి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# చిన్నారి వైద్యానికి సింగరేణి ఉద్యోగుల ఆర్థిక సహాయం

**- సింగరేణి ఉద్యోగులు కూడా తమ సహకారం అందిస్తామని ముందుకు రావడం సంతోషకరం - సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీరావు**



**రామగిరి, మే 08(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామం రాంనగర్ లో ఉంటున్న చిన్నారి రెవెల్లి భాను శ్రీ(6) గత నెలలో గోడకూలి ఈ చిన్నారికి కాలు ? నుజ్జు నుజ్జు అయిన విషయం విధితమే. చిన్నారి రెవెల్లి భాను శ్రీ(6)కి వైద్య ఖర్చులకు సింగరేణి ఆర్జీ-టు డివిజన్ ఓసీపీ-త్రీ ఉద్యోగులు శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని సంజీవినీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ చిన్నారికి రూ.46,500 ల చెక్కును అందించారు. ఓసీపీ-త్రీ ఎస్డడి సెక్షన్ కు చెందిన ఆర్జీ-టు డివిజన్ ఎస్సీఎ ఎస్టీ సంఘము ఉపాధ్యక్షులు శనిగరపు పోచయ్య, నాగేపల్లి గ్రామానికి చెందిన మట్ట కనికేష్, సంటి రాజేష్, అరే. శ్రీనివాస్,పోలు నాగరాజు, కలవేన వెంకటేష్ లు కలిసి ఈ డబ్బులు జమ చేశారు. ఈ క్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమా- పివి రావు ఆధ్వర్యంలో స్థానిక వార్డు సభ్యులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మనితేజాలు దాతల సహకారంతో కాలు ఆపరేషన్ కు రూ.1.20 లక్షలు అందించిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న సింగరేణి ఉద్యోగులు కూడా తమ సహకారం అందిస్తామని ముందుకు రావడం సంతోషకరమని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. రెండో విడత ఆపరేషన్ కొరకు ఈ నిధులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారపల్లి ఈశ్వరి, సీ.ఆర్.పి మట్ట మమత, వార్డ్ సభ్యులు అల్లి రమేష్, స్థానిక నాయకులు ఒర్రె సురేష్ పాల్గొన్నారు.

## సమాజ సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం

**- మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి.**





**ధర్మపురి, మే 8, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద ఆంగ్లవేదిక్ స్కూల్ కారస్పండెంట్ తోట శంకర్ తల్లి కీ. శే. తోట సుశీలమ్మ స్మారకార్థం యాత్రికులు మరియు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ఎంతో సేవా భావంతో కూడుకున్న కార్యక్రమమని ఆమె అభినందించారు. సమాజ సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. తోట శంకర్ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తూ, తమ తల్లి జ్ఞాపకార్థం ప్రజలకు సేవ చేసే కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

**- దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు**






**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో నగరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ నేతృత్వంలో కాపువాడలోని ప్రముఖ కరీముల్లాహ్ షా దర్గాను సందర్శించి, మంత్రిగారి పేరిట పూల చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక దుఆ (ప్రార్థనలు) నిర్వహించి, అనంతరం స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొహమ్మద్ తాజోద్దీన్ మాట్లాడుతూ ప్రజా నాయకుడు పొన్నం ప్రభాకర్ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని, వారు మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ (అర్బన్ డీసీసీ) అధ్యక్షులు వి.అంజన్ కుమార్ తో పాటు కాంగ్రెస్ మైనారిటీ పార్టీ ముఖ్య నాయకులు నేహాల్ అహ్మద్, ఎండీ కలిమోద్దీన్, అబ్దుల్ రహేమాన్, లేయీక్ ఖాద్రీ, ఖాజా ఖాన్, ఆమెర్, ఎండీ సలీమ్మొద్దీన్, షాహిద్, జమీలోద్దీన్, బషీర్, అబ్దుల్ బారి, అజీం, గణపతి, రాజ్ కుమార్, సిరాజ్ భాయ్, అహ్మద్ భాయ్, అజ్మాత్, ఇమ్రాన్, సర్వర్ ఖాన్, ఆరిఫ్,ముజాహిద్,సలీమ్,మెరాజ్,ఇమ్రాన్అలీ,ఫాహాద్,అక్బర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నగర యువతకు సువర్ణావకాశం

**మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు**






**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రోత్సాహంతో నగర యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. శిక్షణ కాలం మే 11, 2026 నుండి జూన్ 10, 2026 వరకు. సమయం ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుండి 9:00 గంటల వరకు. క్రీడలు: ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, బాక్సింగ్, ఖో-ఖో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, యోగా, జూడో, రెజ్లింగ్‌లో నిష్ణాతులైన కోచ్‌లచే ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ యువత వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరాల ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపరుచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రేషన్, కోచ్‌ల నియామకం. ఆసక్తి గల విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. శిక్షణ ఇవ్వాలనుకునే సీనియర్ ప్లేయర్లు, పీడీ, పేట్ లు తమ దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ సాయంత్రం లోపు అంబేద్కర్ స్టేడియంలో అందజేయాలి అని, మరిన్ని వివరాలకు రాజ్ కుమార్, 80083 26913, సంపత్: 96409 67943, సంప్రదించాలి అని అన్నారు.

# మహిళల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదు

**● పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● మహిళా రక్షణ విభాగాల పనితీరుపై సమీక్ష**

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మహిళల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదు అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో షీటీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, భరోసా కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ మహిళల రక్షణ, భద్రతే షీటీమ్ ప్రధాన ధ్యేయమని, మహిళలకు ఈ విభాగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్ ప్రాంతాల్లో మహిళల భద్రతపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. భరోసా కేంద్రాల్లో లీగల్ అడ్వైజర్, కౌన్సిలర్, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, బాధితులకు తక్షణ సహాయం అందాలని ఆదేశించారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలికలకు సంబంధించిన కేసులు పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన సమయం నుండి వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని, వారి మానసిక స్థితి, విద్యా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. పిల్లల అశ్లీల వీడియోలు, అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలకు సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాలలో అప్‌లోడ్ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయడం ఐటీ చట్టంలోని సెక్షన్



67 బి ప్రకారం నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, యువతులు అత్యవసర పరిస్థితుల్లో షీటీమ్ నంబర్లకు లేదా డయల్ 100కు కాల్ చేసి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఇన్‌స్పెక్టర్ భీమేష్, పెద్దపల్లి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎసై శైలజ, మంచిర్యాల జోనల్ షీటీమ్ ఇన్‌చార్జ్ మహిళా ఎసై ఉషారాణి, భరోసా కేంద్రం, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే కరీంనగర్ మార్కెట్‌గా ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**● మద్దతు ధరతో పాటు అన్ని రకాలుగా అభివృద్ధికి తోడ్పడుతాం ● కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య**

**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రైతు సంక్షేమంలో దిక్సూచిగా నిలిచేలా కృషి చేస్తామని కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. చైర్మన్ తో పాటు పాలకవర్గ సభ్యులను రాజేందర్రావు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కరీంనగర్ మార్కెట్ యార్డ్ పరిధిలో రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. ధాన్యం కొనుగోలు తోపాటు మద్దతుగా కల్పించే విషయంలో రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవహరిస్తున్న నేపథ్యంలో రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా 1991 వ సంవత్సరంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్గా పనిచేసిన వెలిచాల రాజేందర్ రావు సూచనలు సలహాలు తీసుకుంటూ ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. గొప్ప మార్కెట్ గా తీర్చిదిద్దేందుకు తనతోపాటు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. తనతో పాటు డైరెక్టర్లంతా వ్యవసాయంపై చక్కని అవగాహన ఉందని రైతుల కష్టసుఖాలు అందరికీ తెలుసు అని తెలిపారు. రైతులకు సేవ చేసే గొప్ప బాధ్యతను ప్రభుత్వం అప్పగించిందని ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సేవకే అంకితమై పని చేస్తామని పేర్కొన్నారు. ఒకవైపు రైతులకు అన్ని విధాలా అండగా ఉంటూనే రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని ఆకుల నరసన్న తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించిన సీఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు విప్ లు ఎమ్మెల్యేలతో పాటు కరీంనగర్ కాంగ్రెస్ నేతలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ తో పాటు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను వెలిచాల రాజేందర్ రావు శాలువాతో



ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల నర్మదా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్ గెలుపుతో దేశంలో తిరుగులేని శక్తిగా బిజెపి

**● 10 న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లోజరిగే ప్రధాని మోదీ సభను జయప్రదం చేయండి ● బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బిజెపి విజయం చారిత్రకమని , బెంగాల్ ఎన్నికల ఫలితాల కోసం దేశంతో పాటు ప్రపంచమే ఉత్కంఠతతో ఎదురు చూసిందని, బెంగాల్లో బిజెపి భారీ విజయంతో దేశంలోనే తిరుగులేని శక్తిగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. శుక్రవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, యూటి ఎన్నికల్లో బిజెపి, ప్రధాని మోదీ పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం తోనే స్పష్టమైన ఫలితాలు వచ్చాయన్నారు. ముఖ్యంగా అస్సాం, పుదుచ్చేరిలో హ్యాట్రిక్ విజయం సాధించడం, పశ్చిమబెంగాల్లో చారిత్రక విజయాన్ని అందుకోవడం, కేరళలో మూడు సీట్లు గెలుచుకోవడం , ఆయా రాష్ట్రాల్లోబిజెపికి ఓటింగ్ శాతం గణనీయంగా పెరగడం హర్షనీయమన్నారు. ప్రధాని మోదీపాలనే దేశానికి రక్ష అనే భావన ప్రజలందరిలో ఉందని, అందుకే దేశవ్యాప్తంగా ఏ ఎన్నిక జరిగిన బిజెపికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఎన్నో దశాబ్దాలుగా పశ్చిమబెంగాల్ దుర్మార్గపు పార్టీల చేతుల్లో, అధికారంలో బంధి అయ్యిందని , నేడు ఆ పార్టీల కబంధహస్తాల నుండి పశ్చిమబెంగాల్ కు విముక్తి లభించి , బిజెపి అధికారంలోకి రావడంతో ప్రజలంతా సంబరాలు చేసుకుంటున్నారన్నారు. పశ్చిమబెంగాల్లో అధర్మం అంతమై ధర్మం గెలిచిందన్నారు. తెలంగాణలో 10 పదేళ్లు బిఆర్ఎస్ అరాచక, దుర్మార్గ పాలన కొనసాగిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో కొనసాగుతుందని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కంటే స్వప్రయోజనాలే ముఖ్యంగా గత బి ఆర్ ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు పనిచేశాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి బిజెపి కట్టుబడి పనిచేస్తుందన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో , నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లో తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. 10న ప్రధాని మోదీ తెలంగాణపర్యటన సందర్భంగా రాష్ట్రంలో రూ. 7823 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, దిశా, దశ మార్పు బిజెపి, ప్రధాని మోదీ తోనే సాధ్యమన్నారు. పరేడ్ గ్రౌండ్లో జరిగే ప్రధాని మోదీ సభ తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారబోతుందన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం మొట్టమొదటిసారిగా హైదరాబాద్ పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో, అనంతరం పరేడ్ గ్రౌండ్



నిర్వహించనున్న జనాగ్రహ సభను జయ ప్రదం చేయడానికి బిజెపి శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# నిధులు విడుదలైనా అందని 'సమగ్ర సర్వే' వేతనాలు

**● అయోమయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ● సర్వే పూర్తి డేటా ఎంట్రీ ఖరారు కానీ చేతికి రాని పైసలు**

**● డేటా ఎంట్రీ ఆపరేటర్ల పొట్ట కొడుతున్న జిల్లా యంత్రాంగం నిధులున్నా చెల్లింపుల్లో జాప్యం ఎందుకు?**



**మంథని (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'(ఎస్ఈఈఈపిసిఎస్) ప్రక్రియ ముగిసి నెలలు గడుస్తున్నా,రాత్రింబవళ్లు కష్టపడి డేటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లకు మాత్రం ఫలితం దక్కడం లేదు. రాష్ట్ర ఆర్థిక మరియు గణాంకాల డైరెక్టరేట్ ఇప్పటికే బడ్జెట్ విడుదల చేసి, స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ,క్షేత్రస్థాయిలో చెల్లింపులు జరగకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రం నుంచి గ్రీన్ సిగ్నల్ జిల్లాల్లో మాత్రం నిశ్శబ్దం గత ఏడాది నుంచి కొనసాగుతున్న ఈ సర్వే ప్రక్రియలో భాగంగా,కోట్లాది కుటుంబాల సమాచారాన్ని ఆన్‌లైన్ చేయడంలో వందలాది మంది ప్రభుత్వ మరియు ప్రైవేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాలుపంచుకున్నారు.ఈ క్రమంలో 2025-26 బడ్జెట్ కింద అదనపు నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం మెమో నెం. 6280 ద్వారా ఉత్తర్వులు కూడా ఇచ్చింది.సదరు నిధులను నేరుగా ఆపరేటర్ల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయాలని లేదా మండల/మున్సిపల్ అధికారుల ద్వారా పంపిణీ చేయాలని డైరెక్టర్ పి. రుఫస్ దాతం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పెండింగ్‌లో వేతనాలు ఆవేదనలో నిరుద్యోగులు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనట్లు తెలుస్తున్నా,జిల్లా స్థాయిలో ముఖ్య ప్రణాళికా అధికారులు (సిపిఓ) మరియు జిల్లా కలెక్టర్ల వద్ద ఈ ప్రక్రియ ఎందుకు ఆగిపోయిందో అర్థం కావడం లేదని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా నందలాల వంటి ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది ఆపరేటర్లు తమ సొంత ఖర్చులతో పని పూర్తి చేసినా,పైసా కూడా చేతికి అందలేదని వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యమే కారణమా? చెల్లింపులు పూర్తయిన తర్వాత వినియోగ పత్రాలు (యుసిఎస్) సమర్పించాలని ప్రభుత్వం కోరినప్పటికీ,అసలు చెల్లింపుల ప్రక్రియే ప్రారంభం కాలేదు.మరికొన్ని జిల్లాల్లో నిధులు ఇతర అవసరాలకు మళ్లించారా? లేక సాంకేతిక కారణాలతో ఆగిపోయాయా? అన్నది మిస్టరీగా మారింది. ఆపరేటర్ల డిమాండ్ తక్షణమే జిల్లా కలెక్టర్లు స్పందించి, పెండింగ్‌లో ఉన్న డేటా ఎంట్రీ ఛార్జీలను ఆపరేటర్ల ఖాతాల్లో జమ చేయాలని వారు కోరుతున్నారు.కష్టపడి పనిచేసిన తమకు న్యాయం చేయకపోతే ఆందోళన బాట పడతామని ఆపరేటర్లు హెచ్చరిస్తున్నారు.మెమో నెం:6280 /బడ్జెట్ /పథకం /ఎస్ఈఈఈపిసిఎస్ /2024-25 ప్రకారం నిధులు మంజూరు.డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఖాతాలకు నేరుగా బ్యాంక్ బదిలీ చేయాలి అని డేటా ఎంట్రీ ఆపరేటర్ల కోరుతున్నారు.

# ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ నేతకు పరామర్శ

**- కారు ప్రమాదం- ఆకుల స్వామి వివేక్ పటేల్ కు గాయాలు**

**- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి కట్కూరి సందీప్**



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లిలో జరిగిన కారు ప్రమాదంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్, తెలంగాణ మున్నూరు కాపు యూత్ రాష్ట్ర కన్వీనర్, సామాజిక కార్యకర్త ఆకుల స్వామి వివేక్ పటేల్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి కట్కూరి సందీప్ ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆకుల స్వామి వివేక్ పటేల్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న కట్కూరి సందీప్, ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రమాదం నుంచి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే బీసీ సమాజ హక్కుల కోసం ఆకుల స్వామి వివేక్ పటేల్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన త్వరితగతిన పూర్తిస్థాయిలో కోలుకోవాలని పార్టీ నాయకులు, అభిమానులు, బీసీ సంఘాల ప్రతినిధులు ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## జిపి కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**- ఇల్లందు ఎంపీఓ కి ఐ ఎఫ్ టి యు వినతి**



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ ఽ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో గురువారం ఇల్లెందు ఎంపీఓ చిరంజీవి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి, తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తొగర సామ్యూల్ మాట్లాడుతూ గత మార్చి,ఏప్రిల్ నెలల వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో నిత్యం గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదని విమర్శించారు. పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు ఇల్లెందు ఏరియా కమిటీ అధ్యక్షులు రావూరి ఉపేందర్ రావు,తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీఽ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రామండ్ల మోహన్ రావు, మండల అధ్యక్షులు రామిశెట్టి నరసింహారావు, మండల నాయకులు బానోత్ భీముడు, దనసరి వంశీ, అజ్మీర శ్రీను,సూర్ణపాక ప్రవీణ్, పడిగ కోటి తదితరులు పాల్గొన్నారు.

## నూతన డీజీపీ సీవీ ఆనంద్‌తో ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం భేటీ

**- పీఎంజే జ్యువెలర్స్ ఘటన దర్యాప్తు వేగవంతం చేయాలని వినతి**



**కరీంనగర్ టౌన్, మే8(ది క్రైమ్ న్యూస్):** ఇటీవల తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా నియమితులైన సీవీ ఆనంద్ ని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం గురువారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం డీజీపీతో సమావేశమై జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన పీఎంజే జ్యువెలర్స్ ఘటన కు సంబంధించిన వివరాలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తును మరింత వేగవంతం చేసి, నిందితులను త్వరితగతిన పట్టుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని డీజీపీ ని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల్లో భద్రతా భావం పెంపొందించేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా అభినందించారు. డీజీపీ సీవీ ఆనంద్ సానుకూలంగా స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## మధిరలో పర్యటించిన జిల్లా కలెక్టర్



**మధిర ప్రతినిధి మే 8:(ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ శుక్రవారం నాడు మధిర లో పర్యటించారు. దీనిలోని భాగంగా నిర్మాణంలో ఉన్న జూనియర్ డిగ్రీ కాలేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం 100 పడకల ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న మౌలిక వసతులు వైద్య సదుపాయాల గురించి పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని ఈ సందర్భంగా వారు అధికారులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలతో జూనియర్ డిగ్రీ కాలేజ్ నిర్మాణ పనులను సొంతంగా తన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మధిర తాహాసిల్దార్ రాళ్ల బండి రాంబాబు, మున్సిపల్ డి ఈ నరేష్ రెడ్డి, ఆర్ఐ శిరీష, సర్వేర్ ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సోరంశెట్టి కిషోర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెంలో నిర్మిస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని తనిఖీ చేసి, జిల్లా కలెక్టర్

## ● మహిళలు ప్రభుత్వ అవకాశాలను అందిపుచ్చుకోను ఆర్థికంగా ఎదగాలి

**మధిర ప్రతినిధి మే 8 (ది క్రైమ్ న్యూస్):** లాభంతో కూడిన వ్యాపారం సృష్టించుకొని మరొకరికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం, రాజుపాలెం గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద నిర్మాణంలో ఉన్న ఒక మెగావాట్ సామర్థ్యపు సోలార్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. సౌర విద్యుత్ ప్లాంట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు, సాంకేతిక అంశాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ప్రస్తుత పనుల పురోగతిని కలియతిరుగుతూ పరిశీలించారు. ఇంజనీర్స్, ప్లాంట్ నిర్మాణం, భవిష్యత్ విద్యుత్ సరఫరా అంశాలను జిల్లా కలెక్టర్ కు అధికారుల వివరించారు. ఖమ్మం జిల్లా మహిళ సమైక్య సభ్యురాలకు ప్లాంట్ నిర్వాహణ, ఆదాయం, వ్యయం, ఋణం తీర్చడం, పొదుపు, ఇతర మహిళాలకు ఉపాది అదాయం కల్పించడం పై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతకు బలమివ్వడం పథకం యొక్క ముఖ్య లక్ష్యమని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చే త్వరలో ప్రారంభించుకొనే పవర్ ప్లాంట్‌కు అవసరమైన అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ప్లాంట్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై పూర్తి అవగాహన మహిళ సంఘాలకు కల్పించాలని సూచించారు. ప్రాజెక్ట్ పై ఉన్న భయాన్ని పోగొట్టి, నమ్మకం కలిగేట్టు శిక్షణ ఇవ్వాలన్నారు. మండల సమాఖ్యకు రోజువారీ నిర్వహణపై షెడ్యూల్ ఇవ్వాలన్నారు. రిజిష్టర్ల నిర్వహణ, రీడింగ్స్ నమోదు, ప్రతిరోజు చేపట్టాల్సిన పనులపై పూర్తి అవగాహన రావాలన్నారు. సమైక్యలకు ఆదాయ మార్గం ప్రత్యేక దృష్టి పెట్టి సోలార్ ప్యానెల్స్ శుభ్రంగా ఉంచాలని, అన్ని నిర్వహణ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రాజెక్ట్ ఖర్చులో బ్యాంక్ ఋణ సౌకర్యం కల్పిస్తూ ఇందులో సబ్సిడీ కూడా ప్రభుత్వం ఇస్తుందని కలెక్టర్ అన్నారు. నాలుగు సంవత్సరాల వరకు లోన్ నిర్వహణ ఉంటుందని, ఋణం తీరిన తర్వాత నుండి మహిళా సమైక్య సభ్యులకు ఆదాయం వస్తుందని తెలిపారు. చైతన్య మండలి మహిళా సమాఖ్యలు పదిమందికి ఉపాధి, ఆదాయం కల్పిస్తూ, నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఇందిరా మహిళా డెయిరి ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. పాల సేకరించే విధానం, నాణ్యత ప్రమాణాల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరా మహిళా డెయిరీ ద్వారా మహిళలకే పాడి పశువులు అందించి, పాల సేకరణ నుంచి ప్యాకింగ్, బై ప్రోడక్ట్ (వెన్నె, మజ్జిగ, పెరుగు, నెయ్యి, స్వీట్స్) ఉత్పత్తి, మార్కెటింగ్ చేసి లాభాలు పొంది మహిళలు పంచుకోనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి యూనిట్ ల గ్రౌండింగ్ తో పాటు అవి విజయవంతంగా నడిచేందుకు అవసరమైన సహాయ, సహకారాలు, చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, దీని కోసం మహిళలకు వ్యాపార దృక్పథం, అధికంగా లాభాలు ఎక్కడి నుంచి రాబట్టాలనే ఆలోచన సరళి రావాలని, తక్కువ రిస్క్ తో వ్యాపారాలు ఎలా చేయాలి వంటి అంశాలు మహిళలకు నేర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో కొండపల్లి శ్రీరామ్, రెడ్కో డిస్ట్రిక్ట్ మేనేజర్ పి. అజయ్ కుమార్, డిఆర్డీవో ఏపిడి జయశ్రీ, ఏడిఏ విజయచందర్, ఎర్రుపాలెం తహసీల్దారు ఉషాశారద, ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, చైతన్య మహిళా సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయండి

**తహశీల్దార్ విజయ్ కుమార్**



**మానకొండూర్,మే8(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని లింగాపూర్, జగ్గయ్యపల్లి, ముంజంపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ విజయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి, అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచిస్తూ కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం కుప్పలపై కప్పడానికి టార్పాలిన్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఇంచార్జీలకు తెలిపారు.మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 1,హకా ఆధ్వర్యంలో 2, సహకార సంఘాల ఆధ్వర్యంలో11,ఐకెపి ఆధ్వర్యంలో 7 మండల వ్యాప్తంగా మొత్తం 21కేంద్రాలున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఆర్.ఐ ప్రీతి, జిపివో సంపత్ పరిశీలనలో తహశీల్దార్ వెంట ఉన్నారు.

# డిజిపి రామ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానం

**చేసిన బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంథని రఘు**




**మంథని మే 8 (ది క్రైమ్ న్యూస్):** ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ లో డి.జి.పి. రామ్ రెడ్డి ని శుక్రవారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామ్ రెడ్డి ని శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు.శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర.ఈ సందర్భంగా బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంథని రఘు మాట్లాడుతూ.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం,ప్రజలకు రక్షణ కల్పించడంలో రామ్ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయడంలో ఆయన ముందున్నారని పేర్కొన్నారు.అంకితభావానికి నిదర్శనం నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉంటూ, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో రామ్ రెడ్డి చూపే చొరవ అద్భుతమని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుల్లం రవీందర్ గౌడ్,వెంకట్ రెడ్డి,కట్కూరి సందీప్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంథని రఘు తదితరులు పాల్గొన్నారు. తమను సాదరంగా ఆహ్వానించి, ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

**● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి**





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్లాటర్ హౌస్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా పశువుల రవాణా, నిషేధిత జంతువుల వధ, అనుమతులు లేకుండా స్లాటర్ హౌస్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టులు మరియు అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పండుగ సమయంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామరస్య వాతావరణం నెలకొనేలా వ్యవహరించాలని ఖురేషి నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించడంతో పాటు వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. పశువుల రవాణాలో వెటర్నరీ సర్టిఫికెట్లు తప్పనిసరి అని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కే శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ హనూక్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, ఎస్.ఐలు మరియు స్లాటర్ హౌస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# కల్వచర్ల గ్రామానికి గర్వకారణం

**- రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన నవ్యశ్రీకి ఘన సన్మానం**

**- ఆడపిల్లల విద్యతోనే సమాజ అభివృద్ధి: లయన్స్ క్లబ్ నాయకులు**



**రామగిరి, మే 08(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కల్వచర్ల గ్రామానికి చెందిన వేముల వెంకన్నసువర్ణ దంపతుల కుమార్తె నవ్యశ్రీ ఆదిలాబాద్ జిల్లాలోని తెలంగాణ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజీ లో చదివి ఎంపీసీ విభాగంలో 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు పొందడం ఎంతో గర్వకారణమని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో నవ్యశ్రీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్, డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్ల చదివితే ఒక కుటుంబమే కాదు సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. నేటి కాలంలో అమ్మాయిలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ ముందుకు సాగుతున్నారు. నవ్యశ్రీ సాధించిన విజయం గ్రామంలోని విద్యార్థినులకు స్ఫూర్తిదాయకం అని అన్నారు.అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, చదువు ద్వారా వారు ఉన్నత స్థానాలకు చేరుకొని కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురాగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వచర్ల గ్రామ ఉపసర్పంచ్ కస్ప మహేందర్, వార్డు సభ్యులు మల్యాల పద్మ, పల్లెర్ల భాగ్యలక్ష్మి, మల్యాల శారద పాల్గొని నవ్యశ్రీని అభినందించారు. అలాగే గ్రామ పెద్దలు, యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# డప్పు చప్పుడుతో వెళ్లి.. బొట్టు పెట్టి.. మోదీ సభకు పిలిచి

**సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలి వినూత్న ఆహ్వానం**



**పటాన్చెరు, మే 08(ది క్రైమ్ న్యూస్):** ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ పరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభకు వస్తున్నారు. మూడో సారి ప్రధాని అయినా తరువాత మొట్టమొదటి సారిగా నరేంద్ర మోదీ తొలి సారిగా తెలంగాణ కు రావడం పట్ల.. బీజేపీ నాయకత్వం భారీ జనసమీకరణ మీద దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఇవాళ సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి, సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి స్థానికులను వినూత్న ఆహ్వానంతో స్వాగతం పలికారు. సంగారెడ్డి జిల్లా నుంచి భారీగా జనసమీకరణ కోసం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయ ప్రచారంగా కాకుండా, ఒక ఇంటి శుభకార్యంలా ప్రతి ఇంటికీ వెళ్లారు. డప్పు చప్పులతో ఆడబిడ్డలకు, డాక్టర్స్, లాయర్స్, పెద్దలకు నుదుటన బొట్టు పెట్టి, ఎంట్రీ పాస్ లను ఇచ్చి సాదరంగా సభకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు బలరాం, పద్మావతి, తదితరులు ఉన్నారు. రాజకీయాలకతీతంగా సభకు రండి ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర బీజేపీ సర్కార్ చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రాజకీయాలకతీతంగా, దేశ ప్రధాని మన రాష్టానికి వస్తున్న వేళ.. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నదే మా సంకల్పం. ప్రధాని ఆ రోజున సుమారు రూ. 8 వేల కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం చేయనున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా పరిధిలో రూ. 2360 కోట్లతో జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ కింద శంకుస్థాపన చేయనున్నారు. అందుకే ప్రతి ఒక్కరినీ గౌరవంగా బొట్టు పెట్టి పిలుస్తున్నాం. పెద్ద ఎత్తున్న ఈ సభ కు విజయవంతం చేయాలి.' అని అంజిరెడ్డి అన్నారు.

# రాజాపూర్ గ్రామ సమస్యలను పరిష్కరించండి

**- ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ - మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య వినతిపై స్పందించిన కలెక్టర్**




**రామగిరి, మే 08(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం ఆర్.జీ -త్రీ ఏరియా ఓసీపి-టు విస్తరణలో భాగంగా ఇండ్లు, భూములు కోల్పోతున్న రాజాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని గతనెల 28న తేదిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య గ్రామ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా స్పందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ఆనుకుని ఉన్న భూములకు, ఇండ్లకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. గ్రామంలో టెంపరరీ నెంబర్లు కేటాయించిన ఇండ్లకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాజాపూర్ గ్రామ శివారులో (ఆదివారంపేట) 18ఎకరాలకు 14 ఎకరాలే తీసుకున్నారని, మిగతా 4ఎకరాల్లోని ఇండ్లని, భూములను తీసుకోవాల్సిందిగా కోరారు. సింగరేణి బ్లాస్టింగ్ల వల్ల గ్రామంలోని కొన్ని ఇండ్లు పగుళ్లు ఏర్పడి కూలిపోయే దశలో ఉన్నాయని, కావున వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంతేకాకుండా రాజాపూర్ గ్రామానికి సంబంధించి కుల, నివాసం, ఆదాయ సర్టిఫికెట్లు నిలిపివేశారని వెల్లడించారు. దానివల్ల గ్రామస్తులు, ముఖ్యంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ మంథని ఆర్డీవో, రామగిరి తహసీల్దార్, ఆర్జీ-త్రీ జీయంకు రాజాపూర్ గ్రామంలోని సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారని రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి- కొమురయ్య అన్నారు.

# ఎన్‌హెచ్-565పై భద్రతకు బలోపేతం

**6 సీసీ కటటమెరాలు విరాళంగా అందించిన దాత**



**నల్గొండ జిల్లా ప్రతినిధి మే 08 (ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా అనుముల మండలం వెంకటాపురం స్టేజి వద్ద ఎన్‌హెచ్-565పై సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు వస్తున్నారు. మరుపాక గ్రామానికి చెందిన శ్రీ మేరెడ్డి వెంకట్ రెడ్డి గ్రామ భద్రత మరియు దొంగతనాల నివారణ లక్ష్యంగా వెంకటాపురం స్టేజ్ మరియు శ్రీనాధాపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయుటకు 6 సీసీ కెమెరాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామ భద్రత, రహదారి పర్యవేక్షణ, దొంగతనాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో నిడమనూరు ఎస్.ఐ యు. సురేష్ ఎస్సై. బి. సాయి ప్రశాంత్ పాల్గొని సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు.

# పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

## ● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రూ.8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుదుతున్నట్లు తెలిపారు. పెట్రోలియం ఉత్పత్తుల టెర్మినల్ ప్రారంభోత్సవం, బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి, కాజీపేట – విజయవాడ మూడో రైల్వే లైన్, కాజీపేట – పెద్దపల్లి బైపాస్ లైన్, రాష్ట్రానికి ఐదు వందే భారత్ రైళ్ల కేటాయింపు వంటి పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి భరోసా భారతీయ జనతా పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ అలె ప్రభాకర్ రాజ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మారబోయిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ మోదీ మూడోసారి ప్రధానిగా ఎన్నికై తెలంగాణకు వస్తున్న ఈ సందర్భంగా ప్రతి డివిజన్, ప్రతి బూత్ స్థాయిలో నాయకులు సమన్వయంతో పనిచేసి భారీగా ప్రజలను సభకు తరలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, అజిత్, ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు స్రవంతి, సీనియర్ నాయకులు వసంత్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరావు తదితర రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీలేని కృషి చేస్తామని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉషముళ్లపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారిపై జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు చేపట్టిన ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉషముళ్లపూడి కమాన్ నుండి గాజులరామరం వెళ్లే ఎల్లమ్మబండ రహదారిపై ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని, ప్రజలు గంటల కొద్దీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ, అవసరమైన చర్యలపై గతంలో అధికారులతో కలిసి ఉషముళ్లపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రోడ్డు మధ్యలో ఉన్న భారీ బండరాళ్ల తొలగింపు, విద్యుత్ స్థంభాల స్థానభ్రంశం, రోడ్డు డివైడర్ల మధ్య సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులు చేపట్టాలని, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా మన్నికైన రహదారులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందించేందుకు తాను శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి అలసత్వం లేకుండా పనులు పూర్తి చేయిస్తానని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హరికృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# సైబర్ కేసుల దర్యాప్తులో బ్యాంకుల సహకారం ముఖ్యం: సైబరాబాద్ సీపీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో శుక్రవారం ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బ్యాంకులు, పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి దర్యాప్తును వేగవంతం చేయడం, ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్ -- డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు వాపసు, డిజిటల్ మోసాల విచారణ అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారాయని తెలిపారు. ఆన్‌లైన్ స్కామ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, ప్రీ-లాంచ్ ఆఫర్లు, కాల్ సెంటర్ మోసాలు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌ల ద్వారా ప్రజలు భారీగా మోసపోతున్నారని చెప్పారు. ఎంతోమంది తమ జీవితకాల పొదుపులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబరాబాద్ పరిధిలో 2025 సంవత్సరంలో సైబర్ మోసాల వల్ల ప్రజలు రూ.438 కోట్లు కోల్పోగా, 2026లో ఇప్పటివరకు రూ.104 కోట్ల నష్టం జరిగినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా అవగాహన పెరుగుతున్నప్పటికీ, ప్రజల్లో మరింత అప్రమత్తత అవసరమని ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్ డేటా భద్రత, మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, దర్యాప్తులో బ్యాంకుల నుంచి సకాలంలో సహకారం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రతి బ్యాంకులో ప్రత్యేకంగా కేంద్రీకృత "సైబర్ సెల్" ఏర్పాటు చేసి ఫిర్యాదులపై వెంటనే స్పందించే విధానం తీసుకురావాలని సీపీ సూచించారు. పెట్టుబడులు పెట్టే ముందు ప్రజలు పూర్తి వివరాలు తెలుసుకోవాలని, అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ, బ్యాంకుల నుంచి ఖాతా వివరాలు, కేవైసీ పత్రాలు, ఫ్రీజ్ కన్ఫర్మేషన్ వివరాలు ఆలస్యంగా అందడం వల్ల నిందితులను పట్టుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మ్యూల్ అకౌంట్ల నియంత్రణ ద్వారా సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఒకసారి ఖాతా ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ మాట్లాడుతూ ఎన్‌సీఆర్‌బీ డేటా విశ్లేషణ ఆధారంగా ప్రతి బ్యాంకులో అప్‌డేట్ చేసిన నోడల్ అధికారుల వివరాలతో "సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్" ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల కమ్యూనికేషన్ వేగవంతమై, బాధితుల సొమ్మును త్వరగా రక్షించవచ్చని తెలిపారు. బ్యాంకు సిబ్బందికి సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణ అవసరమని, కార్పొరేట్ ఖాతాలకు సంబంధించిన రిలేషన్ షిప్ మేనేజర్ల వివరాలను కూడా పోలీసులతో పంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి, క్రైమ్స్ డీసీపీ ఏ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు..







**జమ్మికుంట మే 8 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 58వ జన్మదిన వేడుకలు దేశిని కోటి, పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. దేశిని కోటి, సుంకరి రమేష్ లు మాట్లాడుతూ నాడు ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ అన్న తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్లో తెలంగాణ బిల్లు పెడుతున్న సందర్భంలో ఆంధ్ర నాయకులు ప్రభాకర్ అన్న పై పెప్పర్ స్ప్రే దాడి చేసినప్పటికీ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రం బిల్లును పోరాటం చేశారు ఇప్పుడు బీసీ సంక్షేమ శాఖ మంత్రి అయినప్పటినుండి బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల ఎమ్మెల్యేల సహాయ సహకారాలు తీసుకొని అసెంబ్లీలో తీర్మానం చేసి ఎంతో కృషి చేశారు. ఢిల్లీలో సైతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు బీసీలకు రిజర్వేషన్ రావాలని రాజకీయంగా బీసీ నాయకత్వం బలపడాలని బీసీ విద్యార్థులకు సీట్లు రావాలని బిసి యువకులకు ఉద్యోగాలు రావాలని బీసీ రిజర్వేషన్ పెంచాలని అనేకమైన కార్యక్రమాలు తీసుకున్నారు మరి అలాగే ఈ జమ్మికుంట పట్టణంలో నాడు ఎంపీగా ఉన్నప్పుడు ఆదర్శ రైల్వే స్టేషన్ ఎస్ టి ఓ ఆఫీసు తీసుకొచ్చారు అనేకమైన అభివృద్ధి పనులు చేశారు. ఆయన ఆరోగ్యం అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకుంటూ రానున్న రోజుల్లో ఇంకా ఉన్నతమైన పదవులు రావాలని ఆకాంక్షించారూ. ఈ కార్యక్రమంలో ములుగురి సదయ్య సతీష్ రెడ్డి సాయిని రవి పూదరి రేణుక శివ భాగ్యలక్ష్మి ఎండి సలీం పంజాల అజయ్ గౌరవ కౌన్సిలర్లు దిడ్డి రాము చందా రాజు మాచర్ల రాజు ఒగ్గు రమేష్ ఇంగిత అశోక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వరరావు సూర్య మాజీ కౌన్సిలర్లు బొంగుని వీరన్న రవి కంటి రాజు పిట్టల రమేష్ మాజీ దేవస్థాన డైరెక్టర్ రామ్ రెడ్డి దుబ్బ మల్లన్న కమిటీ చైర్మన్ ముద్దమల రవి చిన్నింటి నాగేందర్ రాకేష్ ప్రసాద్ రాజు ఖలీల్ సునీల్ శివకృష్ణ యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి సజ్జు ప్రవీణ్ సింగిరెడ్డి రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజాపూర్ గ్రామ సమస్యలను పరిష్కరించండి

**- ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ - మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య వినతిపై స్పందించిన కలెక్టర్**




**రామగిరి, మే 08(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం ఆర్.జీ -త్రీ ఏరియా ఓసీపి-టు విస్తరణలో భాగంగా ఇండ్లు, భూములు కోల్పోతున్న రాజాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని గతనెల 28న తేదిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య గ్రామ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ఆనుకుని ఉన్న భూములకు, ఇండ్లకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. గ్రామంలో టెంపరరీ నెంబర్లు కేటాయించిన ఇండ్లకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాజాపూర్ గ్రామ శివారులో(ఆదివారంపేట) 18ఎకరాలకు 14 ఎకరాలే తీసుకున్నారని, మిగతా 4ఎకరాల్లోని ఇండ్లని, భూములను తీసుకోవాల్సిందిగా కోరారు. సింగరేణి బ్లాస్టింగ్ల వల్ల గ్రామంలోని కొన్ని ఇండ్లు పగుళ్లు ఏర్పడి కూలిపోయే దశలో ఉన్నాయని, కావున వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంతేకాకుండా రాజాపూర్ గ్రామానికి సంబంధించి కుల, నివాసం, ఆదాయ సర్టిఫికెట్లు నిలిపివేశారని వెల్లడించారు. దానివల్ల గ్రామస్తులు, ముఖ్యంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ మంథని ఆర్డీవో, రామగిరి తహసీల్దార్, ఆర్జీ-త్రీ జీయంకు రాజాపూర్ గ్రామంలోని సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారని రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి-కొమురయ్య అన్నారు.

# అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి..

**కొర్లకుంట చిత్తారమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్..**



**పటాన్చెరు (జిన్నారం),మే 08(ది క్రైమ్ న్యూస్):** అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ చిత్తారమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించి నూతన దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు , సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రకాశ్ చారి, నరసింహ, బిఆర్ఎస్ పార్టీకార్యకర్తలు,గ్రామస్తులు,ఆలయకమిటీసభ్యులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు..






**జమ్మికుంట మే 8 (ది క్రైమ్ న్యూస్):** హుస్నాబాద్ లో బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన సందర్భంగా శాలువాతో సత్కరించి నాయకులు దేశిని కోటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుగురి సదయ్య కౌన్సిలర్ కు దాడి తిరుపతి మార్క్ డైరెక్టర్ సూర్య కాంగ్రెస్ నాయకులు పాత ప్రసాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు సజ్జు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వజ

# డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది. ఎన్నికల సమయంలోనే కాదు సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు ప్రముఖులకు పెద్ద సవాలు. ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి. వీటి గుట్టుమట్లు ఏమిటో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నీడలో ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది ఆ రంగంలో నిపుణురాలు మధుమితా ముర్గియా. 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపోలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పోర్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి 'ఇమేజ్ క్రియేటింగ్'. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పోర్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపోచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది' అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్. బ్రిటిష్ ఇండియన్.. ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యూనాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ




విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం 'కోడ్ డిపెండెంట్'కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది. ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. 'ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపోయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాసూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యారంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే' అంటుందామె. చెడు ఎంతో ఉంది.. 'ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే' అంటోంది మధుమిత.

# సామాన్యురాలు... పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ



మా ప్రాంతంలోని పేదల కష్టాలే నన్ను పెద్దలతో తలపడేలా చేస్తున్నాయి' అంటోంది దాసరి భారతి. కోవిడ్ సమయంలో నర్స్‌గా పని చేసి ఎందరికో సేవ చేసిన భారతి బాధితులకు న్యాయం జరగాలంటే చట్టం తెలియాలని ఎల్.ఎల్.బి. చదువుతోంది. జోగులాంబ జిల్లా మేడికొండకు చెందిన 26 ఏళ్ల ఈ దళిత యువతి నాగర్ కర్నూల్ ?ర్లమెంట్ స్థానం నుంచి అధికారికంగా పోటీలో ఉంది. 'జనం కోసం గొంతెత్తకుండా ఉండలేక?ోతున్నాను' అంటున్న భారతి పరిచయం. 'నేను హైదరాబాద్ అ?ోలో నర్సింగ్ కాలేజ్‌లో బీఎస్సీ నర్సింగ్ చదివాను. ఎమ్మెస్సీ నర్సింగ్ చేయాలని ఉండేది. నాకు మెరిట్ ఉన్నా సీట్ వచ్చినా కేవలం డబ్బుల్లేక ఒక సంవత్సరం ఆగాల్సి వచ్చింది. ఆ తర్వాత పాండిచ్చేరి జిప్‌మర్‌లో ఎమ్మెస్సీ నర్సింగ్ చదివాను. నాలా ఎందరో పేదింటి, దళిత, వెనుకబడ్డ వర్గాల యువతీ యువకులు చదువు కోసం బాధలు పడుతున్నారు. వారిని పట్టించుకునేది ఎవరు? వారి కోసం గొంతెత్తాలని ఎన్నికలలో నిలుచున్నాను' అంటుంది దాసరి భారతి. 26 ఏళ్ల ఈ దళిత అమ్మాయి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 'విడుదలై చిరుతైగల్ కట్చి' (వి.సి.కె.) పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తోంది. ఆమెకు 'టీవీ రిమోట్'ను ఎన్నికల చిహ్నంగా కేటాయించారు. పాండిచ్చేరిలో చదివేటప్పుడు వి.సి.కె. పార్టీ కార్యక్రమాలు గమనించాను. అది దళితుల అభ్యున్నతి కోసం పని చేస్తున్న పార్టీ. ఒక దళిత యువతిగా నేను ఆ పార్టీతో కలిసి పని చేయాలని భావించాను' అని తెలిపింది భారతి. జోగులాంబ జిల్లా మేడికొండ భారతి ఊరు. తండ్రి దాసరి రాములు కౌలు రైతు. తల్లి పద్మావతి గృహిణి. 'మా నాన్న చనిపోయాడు. మేము నలుగురం పిల్లలం. చదువుకోవడానికి చాలా బాధలు పడాల్సి వచ్చింది' అంది భారతి. 'నా బాల్యం నుంచి చూస్తున్నాను. మా ఊరికి ఇప్పటికీ సరైన రోడ్డు లేదు. రోగాలొచ్చినా ఏమొచ్చినా చాలా కష్టం. ఒక నిండు చూలాలు అంబులెన్స్ ఎక్కి రోడ్డు గతుకుల వల్ల దారిలోనే డెలివరీ అయ్యి చని?ోయిన సంఘటన కళ్లారా చూశాను. నిధులన్నీ ఏమవుతున్నాయి? ఎం.ఎల్.ఏలు, ఎం.పి.లు, మంత్రులు ఏం చేస్తుంటారు? ఎందుకు పరిస్థితులు మార్చరు? కృష్ణ, తుంగభద్రల తీరంలో ఉండేదే మా (?ంతం. కాని పశువులు తాగడానికి కూడా చుక్క నీరు ఇప్పుడు లేదు. రాజకీయ చైతన్యం ఉన్న యువత ఈ పరిస్థితిని ప్రశ్నించే వరకు మార్పు రాదు. అందుకే నేను ఎన్నికలలో నిలుచున్నాను' అంది భారతి. నాగర్ కర్నూల్‌లో పార్లమెంట్ స్థానానికి ప్రవీణ్ కుమార్ (బి.ఆర్.ఎస్), మల్లు రవి (కాంగ్రెస్), భరత్ కుమార్ (బి.జె.పి) పోటీలో ఉన్నారు. భారతి దగ్గర మందీ మార్బలం లేకపోయినా కేవలం తన ధర్మాగ్రహంతో వీరితో తలపడనుంది. 'కోవిడ్ కాలంలో టిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేశాను. పేదలు సరైన వైద్యం అందక, కార్పొరేట్ ఆస్పత్రులకు పోలేక మరణించారు. నాకు ముందు నుంచి కూడా విద్యార్థి రాజకీయాలన్నా, ఉద్యమాలన్నా ఇష్టం. నా విస్తృతి పెరగాలంటే నర్స్‌గా ఉంటే సరి?ోదనిపించింది. అందుకే ఇప్పుడు ఎల్.ఎల్.బి. చదువుతున్నాను. నేను ఎలక్షన్లలో పోటీ చేస్తున్నానని తెలిసి మావాళ్లంతా సంతోషపడుతున్నారు. నాలాంటి వాళ్లు గెలిచి పేదలకు మేలు జరిగినప్పుడే కదా నిజమైన సంతోషం' అని ముగించింది భారతి.

# మొలకలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

ఆరోగ్యంగా ఉండాలని ఎవరు కోరుకోరు. ఎవరైనా ఎప్పుడైనా ఆరోగ్యంగా ఉండాలనే అనుకుంటారు. అయితే అలా అనుకుంటే సరిపోదు.. అందుకు చేయాల్సినవి, తినాల్సినవి కూడా తెలుసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలి అనుకునే వారు వ్యాయామం చెయ్యాలి. శారీరక శ్రమ లేకుంటే ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదు. ఇక తినవలసిన వాటిలో కూడా ఆరోగ్యాన్నిచ్చేవే ఎంచుకోవాలి. మొలకలలో పోషకాలు ఫుల్ ఆరోగ్యం కోసం మనం తినాల్సిన వాటిలో ముఖ్యమైనవి మొలకలు. ప్రతిరోజు ఉదయం అల్పాహారం గానో, లేక సాయంత్రం చిరుతిండి గానో మొలకలు తినడం అలవాటు చేసుకుంటే చాలా మంచిది. మొలకలలో మన శరీరానికి కావలసిన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మన శరీరానికి అవసరమైన వివిధ రకాల విటమిన్లతో పాటు, పొటాషియం, మెగ్నీషియం, రాగి, ఐరన్ వంటి మినరల్స్ కూడా మొలకల్లో సమృద్ధిగా ఉంటాయి. మొలకలతో ఆరోగ్య ప్రయోజనాలు మొలకలు తినడం వల్ల శరీరంలో ఎర్ర రక్త కణాలు గణనీయంగా పెరుగుతాయి. మొలకలు తినడం వల్ల శరీరానికి కావలసిన విటమిన్ సి లభిస్తుంది. జింకు, ఇనుము, క్యాల్షియం వంటి పోషకాలు కూడా అందుతాయి. మొలకలు శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో ఎంతగానో ఉపయోగపడతాయి. జీర్ణవ్యవస్థ పనితీరును మొలకలు మెరుగుపరుస్తాయి. బరువు తగ్గటంలో మొలకల పాత్ర అంతేకాదు శరీర బరువును తగ్గించడంలో కూడా మొలకలు సహాయం చేస్తాయి. మొలకలలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి రక్తప్రసరణను మెరుగు పరచడంతో పాటు, రక్త ప్రవాహంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కీలక భూమిక పోషిస్తాయి. మొలకల వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# వేసవిలో ఉసిరి తినడం మంచిదేనా..?



ఉసిరి వల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజాలు ఉన్నాయో తెలిసిందే. అయితే దీన్ని వేసవిలో తీసుకోవచ్చా. తింటే మంచిదేనా..? అని చాలామందికి ఎదురయ్యే సందేహం. ఆయుర్వేదం పరంగా ఔషధంగా ఉపయోగించే ఈ ఉసిరిని వేసవిలో తీసుకోవచ్చా అంటే..నిపుణులు బేషుగ్గా తీసుకోవచ్చని చెబుతున్నారు. సమ్మర్ హీట్‌కి సరైన ఫ్రూట్ అని చెబుతున్నారు. వేసవిలో ఉసిరి తీసుకోవడంలో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో సవివరంగా తెలుసుకుందామా..! వేసవిలో అందరూ ఎదుర్కొనే సమస్య డీహైడ్రేషన్. దీని కారణంగా జీర్ణ సమస్యలు, అలర్జీలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి పలు సమస్యలు ఎదుర్కొంటారు. వాటికి చెక్‌పెట్టడంలో ఉసిరి సమర్థవంతంగా పనిచేస్తుంది. ఈ సమ్మర్ హీట్‌ని తట్టుకునేలా రోగనిరోధక శక్తినిపెంచి, పొట్టలో వచ్చే మంటను తగ్గిస్తుంది. ఇందులో ఉండే అధిక విటమిన్ సీ కంటెంట్ ఫ్రీ రాడికల్స్‌గా పిలిచే హానికరమైన అణువుల వల్ల కలిగే నష్టాన్ని అరికడుతుంది. అలాగే శరీర కణాలు, కణాజాలా ఆరోగ్యకరమైన పనితీరులో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ ఉసిరి హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి ఉష్ణ సంబంధిత రుగ్మతలను నివారిస్తుంది. శరీరానికి చలువ చేస్తోంది. ఇది హైడ్రేట్‌గా ఉంచడంతో అంతర్గత ఉష్ణోగ్రత పెరగకుండా నియంత్రిస్తుంది. ఫలితంగా చాలా నీరు చెమట రూపంలో వెళ్లినా.. శరీరాన్ని హైడ్రేటడ్‌గా ఉంచడంలో సమర్థవంతంగా పని చేస్తుంది. ఇందులో ఫైబర్ కంటెంట్ కూడా ఎక్కువే. అందువల్ల జీర్ణక్రియను నియంత్రించడంలో సహాయపడటమే గాక మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను నియంత్రించి ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌ను ప్రోత్సహిస్తుంది. అంతేగాదు దగ్గు, జలుబు, జ్వరం, అలెర్జీలు వంటి వ్యాధుల నుంచి వేగంగా కోలుకునేలా చేస్తుంది. కొలస్ట్రాల్‌కి చెక్‌పెడుతుంది. ముఖ్యంగా రక్తంలో ఎల్‌డీఎల్ లేదా చెడు కొలస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. అలాగే ఇది ఆకలిని తగ్గించి, బరువు నియంత్రణలో ఉండేలా చేస్తుంది. ఇందులో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్‌లు చర్మాన్ని యూవీ రేడియేషన్, పర్యావరణ కారకాల నుంచి రక్షిస్తుంది. ఇది మిమ్మల్ని యవ్వనంగా ఉండేలా చేసి ముఖంపై పడే ముడతలను నివారిస్తుంది. అందువల్ల సమ్మర్‌లో ఎండ వేడిని తట్టుకోవడంలో ఉసిరి అద్భుతంగా పనిచేస్తుందని, తప్పక తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# తమల పాకులతో హెయిర్ ఫాల్ సమస్యకు చెక్!

తమలపాకు లేకుండా శుభాకార్యాలను అసలు ఊహించలేం కదా. అలాగే విందుభోజనం తరువాత తాంబూలం సేవించడం కూడా చాలామందికి అలవాటు. విటమిన్ ఎ, సి, బి1, బి2, పొటాషియం, థయామిన్, నియాసిన్ , రైబోఫ్లావిన్ వంటి పోషకాలు తమలపాకులలో లభిస్తాయి. అలాగే జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది. కానీ తమలపాకుతో జుట్టు సమస్యలకు చెక్ చెప్పవచ్చని మీకు తెలుసా? సహజంగా దొరికే తమలపాకుద్వారా జుట్టు రాలడాన్ని నివారించుకోవచ్చు. తలలో దురద, తెల్లజుట్టు సమస్య కూడా నయమ వుతుంది. తమలపాకుల్లో ఉండే విటమిన్లు, కొవ్వు ఆమ్లాలు, ఖనిజాలు జుట్టు చిట్లడం మరియు రాలడాన్ని నివారిస్తాయి. కాబట్టి జుట్టు రాలకుండా ఉండేందుకు తమలపాకులను ఉపయోగించే మార్గాన్ని తెలుసుకుందాం. తమలపాకు నీటితో జుట్టును కడగాలి.. తల కడుక్కోవడానికి 15-20 తమలపాకులను ఒక పాత్రలో వేసి మరిగించాలి. చల్లారిన తరువాత దీంతో జుట్టులో వాచ్ చేయాలి. తమలపాకులో యాంటీమైక్రోబయల్ , యాంటీ బాక్టీరియల్ లక్షణాలు స్కాల్ప్ ఇన్ఫెక్షన్ సమస్యను దూరం చేస్తుంది. తమలపాకు,నెయ్యి హెయిర్ మాస్క్.. తమలపాకులని తీసుకుని శుభ్రంగా కడిగి పేస్టు చేయాలి. ఇందులో టీస్పూను నెయ్యి వేసి కలిపి, మాడు నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. గంట తరువాత నీటితో కడిగేయాలి. ఇలా వారానికి ఒకసారి ఈ మాస్క్ వేసుకోవడం వల్ల తమలపాకులోని పోషకాలు అంది జుట్టు మరింత బలంగా దట్టంగా పెరుగుతుంది. ఇలా వారంలో ఒకసారి లేదా నెలకు రెండు మూడు సార్లు చొప్పున చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. తమలపాకులతో చేసిన నూనె.. జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే తమలపాకుతో చేసిన నూనె కంటే గొప్పది ఏదీ ఉండదు. కొబ్బరి లేదా ఆవనూనెలో 10 నుండి 15 తమలపాకులను వేసి సన్నని మంటపై మరిగించాలి. తమలపాకులు నల్లగా మారాగా, ఈ నూనెను వడపోసి, స్కాల్ప్ నుంచి జుట్టంతా బాగా పట్టించాలి. ఇది రాత్రంతా ఉంచుకోవచ్చు. తలస్నానానికి ఒక గంట ముందు రాసు కోవచ్చు. తమలపాకులను తినండి.. ఉదయం ఖాళీ కడుపుతో 5-6 తమలపాకులను నమలవచ్చు లేదా 10-5 తమలపాకులను నీటిలో ఉడకబెట్టి ఆ నీటిని తీసుకోవచ్చు. ఇది జుట్టు రాలడాన్ని నియంత్రించడమే కాకుండా, ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

# వేసవిలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచే ఆహారాలివే



ప్రస్తుతం మనం విపరీతమైన వేసవి కాలాన్ని చూస్తున్నాం. గతానికి భిన్నంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితులను చూస్తున్నాము. గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు బద్దలు కొడుతూ విజృంభిస్తున్న పరిస్థితులను చూస్తున్నాము. అయితే ఈ సమయంలో వేసవి వేడి నుండి తట్టుకోవడానికి మనం కొన్ని ఆహార పదార్థాలను తినాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైడ్రేటెడ్‌గా శరీరాన్ని ఉంచే ఆహారాలు వేసవి కాలంలో శరీరం చెమట కారణంగా డీహైడ్రేట్ అవుతుంది. ఇలా శరీరం డీహైడ్రేట్ అవ్వడం వల్ల మన శరీరంలో ఉన్న శక్తినంత లాగేస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. నీరసంగా అనిపిస్తుంది. కాబట్టి ఈ సమయంలో డీ హైడ్రేట్ కాకుండా ఆరోగ్యంగా ఉండడం కోసం కొన్ని ఆహార పదార్థాలను మన ఆహారంలో భాగంగా చేసుకోవాలి. అంతేకాదు ఎక్కువగా నీటిని కూడా తాగాలి. ఇక ఆహారాలలో నీరు సమృద్ధిగా ఉన్నటువంటి ఆహారాలను తీసుకోవాలి. శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడటానికి దోహదం చేస్తాయి. అటువంటి వాటిలో కీరా దోసకాయ ఒకటి. కీరా దోసకాయ లో వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మన శరీరంలో డీహైడ్రేట్ అయిన నీటిని తిరిగి మనకు అందించడానికి సహాయం చేస్తుంది. పుచ్చకాయ.. కీర దోసకాయలు 95 శాతం కంటే ఎక్కువ నీటి కంటెంట్ తో ఉంటాయి. వీటిని సలాడ్ గా చేసుకుని తింటే మన శరీరానికి కావలసిన నీటి శాతం పుష్కలంగా లభిస్తుంది. ఇక వేసవి కాలంలో అత్యధికంగా నీటితో నిండి ఉండే మరొక ఆహారపదార్థం పుచ్చకాయ. ఇది కూడా మన శరీరం హైడ్రేటెడ్ గా ఉండడానికి చాలా బాగా ఉపయోగపడుతుంది. నారింజ, బచ్చలికూర వంటి ఆకుకూరలు.. నారింజ పండ్లలో కూడా విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. నారింజ పండ్లలో విటమిన్ సి మంచి మూలకంగా ఉండటమే కాకుండా, 87% నీటిని కలిగి ఉండడం వల్ల వీటిని తింటే శరీరంలో నీటి లోటు తీరుతుంది. అంతేకాదు ఆకుకూరల్లో కూడా నీటి శాతం ఎక్కువగా ఉంటుంది బచ్చలి కూర వంటి ఆకుకూరల్లో నీటి శాతం, పోషకాలు ఎక్కువగా ఉండటం వల్ల ఇవి ఎండాకాలంలో మెరుగైన ఆహారంగా చెప్పవచ్చు. క్యాప్సికం, సొరకాయ బీరకాయలలోనూ వాటర్ కంటెంట్.. అలాగే క్యాప్సికం.. క్యాప్సికం కూడా 92 శాతం నీటి కంటెంట్తో మన శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. ఇక క్యాప్సికమ్ ను సలాడ్లలో భాగంగా చేసుకుని తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. సొరకాయ, బీరకాయ వంటి కూరగాయలలో కూడా నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని కూడా ఎండాకాలంలో తినడం చాలా మంచిది.

# ఆంధ్రప్రదేశ్

## ఆపదలో అండగా... సేవల్లో మిన్నగా రెడ్‌క్రాస్

### అవసరంలో ఆదుకునే చేయి... రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తి

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,మే8 : సమాజంలో ఆపద సమయంలో ముందుండి సేవలు అందిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సంస్థ రెడ్‌క్రాస్ అని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలబడటం, విపత్తుల సమయంలో సాయం అందించడం, రక్తదానం వంటి కార్యక్రమాల ద్వారా రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందిస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలకు ప్రతీకగా నిలిచిన రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ వేడుకలు విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. సమాజంలో మానవత్వాన్ని నిలబెట్టే సంస్థగా రెడ్ క్రాస్ విశేష పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్తదాన శిబిరాలు, వైద్య సేవలు, పేదలకు సహాయం వంటి కార్యక్రమాల ద్వారా ఎంతో మందికి అండగా నిలుస్తోందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డా. జి.సమరం మాట్లాడుతూ యువతలో రక్తదానంపై అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఆరోగ్య శిబిరాలు, ప్రాథమిక చికిత్సకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ల్గ÷స్ ఛైర్మన్ డా. వెలగా జోషి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవలు కేవలం వైద్యరంగానికే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా కొనసాగుతున్నాయని అన్నారు. కార్యదర్శి చిట్టిబాబు సంస్థ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కనకారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, రెడ్ క్రాస్ వాలంటీర్లు, వైద్య సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు. రక్తదానం, మానవతా సేవల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

## 12న ఇంద్రకీలాద్రిపై హనుమత్ జయంతి

విజయవాడ,మే8 : ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై మే 12న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల కోసం దుర్గగుడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మే 12న ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న మూడు ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరుగనున్నాయి. అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. క్షేత్ర పాలక ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమం చేయనున్నారు. మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహించనున్నారు. నాగవల్లీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పుష్పాలు, ప్రత్యేక దండలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించనున్నారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దేవస్థానం పిలుపునిచ్చింది.

## పంటలను కొనకుండా రైతులకు దగా

### కాంగ్రెస్ సర్కార్ తీరుపై హరీష్ మండిపాటు

### కెసిఆర్ హయాంలో విద్యారంగ తీరు భేష్

### నీతి ఆయోగ్ నివేదికే నిదర్శనమని వెల్లడి

హైదరాబాద్,మే8 : రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతులతోనే అధికారుల కాళ్లు మొక్కిస్తున్న ఘనత ఈ రేవంత్ సర్కార్‌దే అని విమర్శించారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను ప్రభుత్వమే కొనకపోతే ఆ రైతన్నకు దిక్కెవరు అని ప్రశ్నించారు. కల్లాల్లో రోజుల తరబడి పంటకు కాపలా కాస్తూ, దిగులుతో అన్నదాతలు పిట్టల్లా రాలిపోతుంటే కళ్లప్పగించి చూడటం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాల్సిన పాలకులే ముప్పుతిప్పలు పెట్టి మరణశాసనం రాస్తుంటే, దిక్కుతోచని అన్నదాత 'నీ బాంచన్ పంట కొనండి' అని కాళ్లపై పడటం తప్ప ఇంకేం చేయగలడు అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్న కన్నీటి శాపం పాలకులను వదలదు.. ఆ పాపం వారిని నీడలా వెంటాడుతూనే ఉంటుందని అన్నారు. ఇదిలావుంటే కేసీఆర్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలనలో విద్యా రంగం అద్భుతమైన ప్రగతి సాధించిందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ తేల్చిచెప్పిందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందంటూ కాంగ్రెస్, బీజేపీ, కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని, సత్యదూరమని ఈ నివేదికతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన స్కూల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ఇన్ ఇండియా నివేదిక బీఆర్ఎస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి సాక్ష్యంగా నిలిచిందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో జీరో డ్రాపౌట్స్ నమోదును నీతి ఆయోగ్ ప్రశంసించిందని పేర్కొన్నారు. విద్యార్థుల నమోదు లో ముఖ్యంగా బాలికల విద్యలో తెలంగాణ జాతీయ సగటును మించి రికార్డు సృష్టించిందని చెప్పారు. పదేళ్లలో ప్రభుత్వ బడుల్లో కరెంటు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులతో పాటు.. 86 శాతం స్కూళ్లకు కంప్యూటర్లు అందించి దేశంలోనే అగ్రభాగంలో నిలిచిందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో గురుకులాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణతో విద్యా రంగానికి కేసీఆర్ ఎంత పెద్దపీట వేశారో చెప్పడానికి కేంద్ర ప్రభుత్వమిచ్చిన ఈ గణాంకాలే నిదర్శనమని అన్నారు. రాజకీయాల కోసం కేసీఆర్‌పై, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేసే వారికి నీతి ఆయోగ్ నివేదిక చెంపపెట్టు అని విమర్శించారు.

# ఎస్సీలతో పాటు బుడగజంగాలకు సంక్షేమ పథకాలు

### వారందరికి గృహ వసతి కల్పించాల్సిందే

### ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు

### 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

### కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం




అమరావతి,మే8 : ఎస్సీలకు కలిగే ప్రతి లబ్దిని బుడగ జంగాలకు వర్తింప చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని సీఎం ఆదేశించారు. డిసెంబర్ నాటికల్లా మరో 2.38 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరగాలన్నారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సమావేశంలో వివిధ సంక్షేమ శాఖలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, హౌసింగ్ వంటి అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల పట్టాల పంపిణీ, క్రమబద్ధీకరణ వంటి అంశాలపై కలెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2 లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా వేసినట్లు సీఎం తెలిపారు. 3 సెంట్లు గ్రామాలు, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. లబ్దిదారులు అంగీకరిస్తే.. ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సూచించారు. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కేబినెట్‌కు పంపాలని... ఆమోదిస్తామన్నారు. ఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి చేయగలిగితే.. విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. గుంటూరులో 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉందని.. దీనిపై కేంద్రంతో మాట్లాడతామన్నారు. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడ గజంగాలకు వర్తించేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో బీసీ కులాల వెనుకబాటుతనం అధ్యయనం చేయడానికి ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. బీసీ హాస్టళ్లల్లో ఆర్వో యూనిట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని.. హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. ముస్లిం జనాభా ఉన్న చోట 175 నియోజకవర్గాల్లోనూ రూరల్ ఆటోనగర్‌లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామికవాడ సిద్ధం అవుతుందని అన్నారు. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామికవాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. లైవ్ లీ హుడ్ హబ్‌లుగా వీటిని అభివృద్ధి చేయాలని సూచించారు. జలధార, పశుగ్రాసం సహా వివిధ కార్యక్రమాలను కేంద్ర పథకాలతో ఇంటిగ్రేట్ చేసి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## ఉన్నత విద్యకు వెళ్లే వారికి అండ

### పావలా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు

### కెలక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి,మే8 : దేశ విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులకు పావలా వడ్డీకే విద్య రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్లను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యమని అన్నారు. చాలామంది రుణాలు అందక చదువుకలేక పోతున్నారని, అలాంటి వారికి అండగా నిలవాల్సి ఉందన్నారు. శుక్రవారం రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలతోపాటు తల్లికి వందనం, సంక్షేమంపై అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అలాగే పథకాల అమలు, లబ్దిదారుల ఇంటిగ్రేషన్‌పై వారికి సీఎం దిశానిర్దేశర చేశారు. అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీ శక్తి, దివ్యాంగశక్తి పథకాలపై చర్చించారు. దీపం-2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. దీపం-2.0 పథకానికి ఇప్పటి వరకు రూ.3,504 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. స్త్రీ శక్తి కోసం ఏడాదికి రూ.1,940 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. తల్లికి వందనం కింద 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఏజెన్సీల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ప్రకటించారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ల సమావేశం గురువారం రాజధాని అమరావతిలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం సాయంత్రం ముగిసింది.

## తమిళనాడు ఉత్కంఠకు తెర

### నేడు సిఎంగా విజయ్ ప్రమాణం

### మద్దతుల లేఖలతో గవర్నరర్తో మరోమారు భేటీ

### ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు గవర్నర్ అనుమతి

### 11 గంటలకు నెహ్రూ స్టేడియంలో ప్రమాణ కార్యక్రమం

### కాంగ్రెస్, లెఫ్ట్ తదితర పార్టీల మద్దతు లేఖలు సమర్పణ

### టివికె కూటమి బలం 120కి చేరిక..మద్దతుపై అనేక మెలికలు



చెన్నై,మే8 : తమిళనాట ఉత్కంఠకు తెరపడింది. టివికె అధినేత విజయ్ నేడు సిఎంగా ప్రమాణం చేయబోతున్నారు. వివిధ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు సమర్పించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మే 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది. ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరడానికి అడుగులు పడుతున్నా.. మిత్రపక్షాల షరతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు వీసీకే తమ మద్దతుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశాయి. విజయ్ ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వామపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. టీవీకే ప్రభుత్వానికి తాము కేవలం బయటి నుంచే మద్దతు ఇస్తామని.. కేబినెట్‌లో చేరే ఉద్దేశం లేదని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. ప్రస్తుత రాజకీయ అనిశ్చితిని తొలగించి, ఒక సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న ఉద్దేశంతోనే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఇక, టీవీకేకు ముందుగానే మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్‌కు ఒక కీలకమైన షరతు విధించింది. భవిష్యత్తులో టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ మతతత్వ పార్టీలతో చేతులు కలపకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ షరతుకు లోబడి ఉంటేనే.. తమ 5 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటుందని హైకమాండ్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకమైన 2 స్థానాలు కలిగిన విడుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ తనదైన వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. వచ్చే ఉపఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని ఆయన షరతు పెట్టారు. తిరుమావళవన్ స్వయంగా తిరుచ్చి ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ స్థానం ఇస్తేనే టీవీకేకు మద్దతుపై తుది సంతకం చేసే అవకాశం ఉంది. వామపక్షాలు కేబినెట్‌లో చేరకపోవడం వల్ల విజయ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలకే ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, తిరుమావళవన్ కోరుతున్న 'తిరుచ్చి ఈస్ట్' స్థానం విషయంలో విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రాయలసీమ కాదు... రాయల్ సీమ

### రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ఎక్స్‌లో బాబు పోస్ట్

అమరావతి : ఏపీకి ప్రపంచ ప్రఖ్యాత ఐకానిక్ మోటార్ సైకిల్ బ్రాండ్ 'రాయల్ ఎన్‌ఫీల్డ్' రాబోతోంది. తిరుపతిలో రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాయలసీమ ఇప్పుడు రాయల్‌సీమ' అనే టైటిల్‌తో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఉన్న ఫొటోను సీఎం చంద్రబాబు షేర్ చేశారు. ఈ ఫొటోకి 'రాయలసీమకు దూసుకువస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్' అంటూ క్యాప్షన్ పెట్టారు. రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ).. రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ పరిశ్రమకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ కోసం సత్యవేడు పరిధిలోని వన్నెలూరు, రాళ్లకుప్పం గ్రామాల్లో సుమారు 267 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 5,000 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గురువారం జరిగిన కలెక్టర్ల సమావేశంలోనూ ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రావడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. కాలేజీ రోజుల్లో బు÷-లలెట్ బండి నడిపిన సంగతులను సీఎం గుర్తుచేసుకున్నారు. 'కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా.. ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం' అంటూ ఆనాటి జ్ఞాపకాలను చంద్రబాబు పంచుకున్నారు.

## కేంద్రమంత్రి గుండాలతో దాడిచేయిస్తారా?

### దాడులకు సిఎం రేవంత్ వత్తాసు పలికితే ఎలా

### కరీంనగర్ ఘటనలపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు

హైదరాబాద్,మే8 : శాంతిభద్రతలను కాపాడాల్సిన కేంద్ర హోంమంత్రి గూండాలను పంపి దాడులు చేయిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ నాయకులపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. డీజీపీని కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, దేశపతి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ దాడులకు సీఎం రేవంత్ రెడ్డి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యాలయమైన క్యాంప్ ఆఫీసులపై దాడి చేశారని తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, హుజూరాబాద్, మల్కాజిగిరిలో దాడులు చేశారని పేర్కొన్నారు. బాహాటంగా బీజేపీ గూండాలు దాడులకు తెగబడ్డారని అన్నారు. వాళ్లు దాడులు చేస్తుంటే పోలీసులు అదుపు చేయకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాసనసభ్యులకే రక్షణ లేకుండా పోయిందని దేశపతి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం ధర్మం కోసం అని చెప్తు పుట్టుక గురించి మాట్లాడతారా? ఇంత కుసంస్కారమా అని బండి సంజయ్ తీరుపై దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. బండి సంజయ్ నోటి నుంచి ఒక శ్లోకం వినలేదని తెలిపారు. ప్రజలకు అవసరం వచ్చే మాట ఒక్కటి కూడా వినలేదని పేర్కొన్నారు. పొద్దున లేస్తే కేటీఆర్, కేసీఆర్ లను తిట్టడం తప్ప ఏం చేతకాదని విమర్శించారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఇకపోతే బండి సంజయ్, రేవంత్ రెడ్డి మధ్య చీకటి ఒప్పందం ఉందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆపద వచ్చినప్పుడల్లా బండి సంజయ్ కాపాడుతున్నాడని తెలిపారు. కరీంనగర్ దాడి వెనుక రేవంత్ రెడ్డి సహకారం ఉందని ఆరోపించారు. 2014కు ముందు బండి సంజయ్ చందాలతో బతికేవాడని అన్నారు. కానీ ఇప్పుడు అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మీరు మాట్లాడిన భాషలోనే మీకు సమాధానమిచ్చామని తెలిపారు.




## పెద్ది మూవీ అమెరికాలో

# రికార్డుల సృష్టి

### భారీగా అమ్ముడైన ప్రీ రిలీజ్ టిక్కెట్లు

సాధారణంగా ఒక సినిమా బాక్సాఫీస్ సత్తా ఏంటో తెలియాలంటే థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాలి. ట్రైలర్ ఇచ్చే కిక్కును బట్టే ఆ సినిమా మార్కెట్ పొటన్షియాలిటీ ఆధారపడి ఉంటుంది. కానీ, కొన్ని సినిమాలు మాత్రం ఈ లెక్కలకు అతీతం. కేవలం క్రేజీ కాంబినేషన్ మీద ఉన్న నమ్మకం, హీరో ఇమేజ్ ఇచ్చే ధైర్యంతోనే అంచనాలు ఆకాశాన్ని తాకుతుంటాయి. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది సినిమా సరిగ్గా ఇదే మ్యాజిక్ చేస్తోంది. పెద్ది సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి కూడా అంచనాలు ఆకాశాన్ని తాకుతూనే ఉన్నాయి. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ పెద్ది రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. ఇంకా ట్రైలర్ కూడా బయటకు రాకముందే నార్త్ అమెరికాలో రికార్డుల వేట మొదలైపోయింది. బుకింగ్స్ ప్రారంభించిన కేవలం నాలుగు గంటల్లోనే 100ఐ మార్కును దాటి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏ భారతీయ సినిమాకు సాధ్యం కాని రీతిలో, అతి తక్కువ సమయంలో ఈ మైలురాయిని చేరుకోవడం ఒక్క రామ్ చరణ్‌కే చెల్లింది. మెగా అభిమానులు కళ్ళలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న జూన్ 3వ తేదీ రానే వస్తోంది. ఆ రోజు ఓవర్సీస్‌లో భారీ ఎత్తున ప్రీమియర్లతో పెద్ది జాతర మొదలుకానుంది. ఇప్పటి వరకు విడుదలైన టీజర్స్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఆ రా అండ్ రస్టిక్ లుక్స్ సినిమాపై విపరీతమైన ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పటికే పెద్ది నుంచి రిలీజైన పాటలు, విజువల్స్ చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. అదేవిధంగా త్వరలో రాబోయే థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయం. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, అభిమానులను ఉర్రూతలూగించేలా బుచ్చిబాబు.. ప్రతి సీన్‌ను చెక్కినట్లు తెలుస్తోంది. పెద్ది ఒక ఎమోషనల్ అండ్ మాస్ ఎంట్టంల్గ÷నర్ అని, ఎక్కడా తగ్గకుండా హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్సలతో ఈ చిత్రం ఉండబోతోందని సినిమా యూనిట్ చెప్పుకొస్తోంది. పాన్ ఇండియా వైడ్ గా పెద్ది మేనియా ఇప్పుడిప్పుడే మొదలైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడానికి, సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేయడానికి గ్లోబల్ స్టార్ సిద్ధమైపోయాడు. మరి ఈ సినిమా థియేటర్లలో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.




## పల్లెటూరు ప్రేమకథ..'గోదారి గట్టుపైన'

మేం ఫేమస్ చిత్రంతో యూత్ ఆడియెన్స్‌కు చేరువైన సుమంత్ ప్రభాస్, సుదీర్ఘ విరామం తర్వాత నటించిన తాజా చిత్రం 'గోదారి గట్టుపైన'. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే గోదావరి తీర ప్రాంత నేపథ్యంలో, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాల మధ్య దర్శకుడు సుభాష్ చంద్ర ఈ చిత్రంను తెరకెక్కించారు. కోనసీమలోని ఓ మారుమూల గ్రామంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే శ్యామ్ బాబు (జగపతిబాబు)కు తన కూతురు మాయ (నిధి ప్రదీప్) అంటే ప్రాణం. ఆమె సంతోషమే తన ప్రపంచంగా బ్రతుకుతుంటాడు. అయితే, మాయ జీవితంలోకి ఆటో డ్రైవర్ రాజు (సుమంత్ ప్రభాస్) ప్రవేశించడంతో కథ మలుపు తిరుగుతుంది. వీరిద్దరి మధ్య చిగురించిన ప్రేమ, భిన్నమైన సామాజిక నేపథ్యాల కారణంగా తండ్రీకూతుళ్ల మధ్య ఎలాంటి సంఘర్షణకు దారితీసింది? చివరకు ప్రేమ గెలిచిందా లేక తండ్రి బాధ్యత గెలిచిందా? అనేదే ఈ చిత్ర ప్రధానాంశం. తెలంగాణ యాసకు అలవాటు పడిన సుమంత్, ఈ సినిమాలో గోదావరి యాసను ఎంతో సహజంగా పలికించి ఆశ్చర్యపరిచారు. ఆటో డ్రైవర్ పాత్రలో ఆయన నటన పరిణతి చెందింది. కూతురి భవిష్యత్తు కోసం ఆరాటపడే సగటు తండ్రి పాత్రలో జగపతిబాబు మరోసారి తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. సినిమాకు ఆయనే ప్రధాన బలం. తొలి సినిమా అయినప్పటికీ, భావోద్వేగపూరితమైన సన్నివేశాల్లో నిధి చక్కటి ప్రతిభ కనబరిచారు. నెల్లూరు సుదర్శన్ మార్క్ కామెడీ సినిమాకు పెద్ద ఎసెట్. బోరింగ్ సీన్స్‌లో కూడా తన పంచ్‌లతో థియేటర్‌లో నవ్వులు పూయించారు. దర్శకుడు సుభాష్ చంద్ర పాత కథనే తీసుకున్నప్పటికీ, దానికి భావోద్వేగాలను అద్ది తెరకెక్కించిన తీరు బాగుంది. సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ గోదావరి అందాలను, ప్లలెటూరి వాతావరణాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించింది. నాగవంశీ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాలను ఎలివేట్ చేయడంలో సక్సెస్ అయింది. సినిమా ప్రథమార్థం ప్రేమకథ మరియు కామెడీతో సరదాగా సాగిపోతుంది. సెకండాఫ్ పూర్తిగా ఎమోషన్స్ మీద ఆధారపడింది. కొన్ని చోట్ల కథ నెమ్మదించినట్లు అనిపించినా, క్లైమాక్స్ వైపు వెళ్లేకొద్దీ తండ్రీకూతుళ్ల బంధం ప్రేక్షకులను కదిలిస్తుంది. 'అమ్మ బాగుంటేనే ఇల్లు బాగుంటుంది', 'అతను ఫ్యాక్టరీకి కాదు.. కుటుంబానికి సెక్యూరిటీ గార్డ్' వంటి సంభాషణలు మనసును హత్తుకుంటాయి. మొత్తానికి 'గోదారి గట్టుపైన' ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సాగే ఒక స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రం. వేసవి సెలవుల్లో కుటుంబంతో కలిసి చూడదగ్గ ఒక పాజిటివ్ ఫ్యామిలీ డ్రామాగా దీనిని అభివర్ణించవచ్చు.





## త్రిష- విజయ్‌ల పెళ్లి అంటూ..వార్తలు చక్కర్లు

త్రిష కృష్ణన్. ప్రస్తుతం తమిళ్ ఇండస్ట్రీలోనే కాదు తెలుగు ఇండస్ట్రీలో కూడా ఈ పేరు మార్మోగిపోతోంది. ఒకప్పుడు సినిమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న త్రిష.. ఇప్పుడు దళపతి విజయ్ తో ప్రేమాయణం నడిపిస్తోంది అనే వార్తల వలన గుర్తింపు తెచ్చుకొంటోంది. విజయ్ ఎన్నికల్లో గెలవడానికి ప్రధాన కారణం త్రిష అనే చెప్పుకొస్తోన్నారు. త్రిష కోసం విజయ్.. తన భార్య సంగీతకు విడాకులు ఇవ్వనున్నాడు. ఈ విషయాన్ని సంగీతనే అధికారికంగా తెలిపింది. ఎలక్షన్స్ ముందు విజయ్ – త్రిష రిలేషన్ ని తప్పు అన్నవాళ్ళే గెలిచాకా ఈ జంట పెళ్ళి చేసుకోవాలని కోరుకోవడం గమనార్హం. రికార్డ్ విజయాన్ని అందుకున్న విజయ్.. త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నాడు. ఇక దాని తరువాత త్రిషను ఆయన రెండో పెళ్ళి చేసుకుంటున్నాడని కోలీవుడ్ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా సంగీతతో విడాకులు తీసుకున్నాకా.. విజయ్, త్రిష మెడలో తాళి కట్టనున్నాడట. 999 లో విజయ్, సంగీతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. ఇక త్రిష, విజయ్ జీవితంలోకి వచ్చాకా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చాలాకాలంగా సంగీత, విజయ్ కి దూరంగా పిల్లలతో కలిసి ఉంటుంది. ఇక ఎన్నికల ముందు సంగీత.. తన భర్త నుంచి విడాకులు కావాలని కేసు వేయడం సంచలనంగా మారింది. తన భర్తకు వేరే నటితో ఎఫైర్ ఉందని, అందుకే అతని నుంచి విడాకులు కోరుకుంటున్నట్లు ఆమె తెలిపింది. ప్రస్తుతం విజయ్ – సంగీత విడాకుల కేసు ఫ్యామిలీ కోర్టులో ఉంది. అతి త్వరలోనే వీరి విడాకులు మంజూరు కానున్నాయని, ఆ తరువాత విజయ్– త్రిష పెళ్ళి చేసుకోబోతున్నారని అంటున్నారు.




## సతీలీలావతితో ఏంచెప్పాలనుకున్నారో..?

### రొటీన్ కథతో బోరింగ్ సినిమా

దాదాపు పదిహేనేళ్ళ క్రితం 'అందాల రాక్షసి' తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఉత్తరాఖండ్ బ్యూటీ లావణ్య త్రిపాఠి ఇవాళ తెలుగువారింటి కోడలు. కథానాయకుడు వరుణ్ తేజ్ తో ఆమె వివాహం 2023లో అయ్యింది. పెళ్ళికి ముందు లావణ్య త్రిపాఠి ఉమెన్ సెంట్రిక్ మూవీ 'హ్యాపీ బర్త్ డే' చేసింది. పెళ్ళి తర్వాత మరోసారి అదే తరహాలో 'సతీ లీలావతి' సినిమాలో టైటిల్ రోల్ ప్లే చేసింది. అప్పట్లో 'హ్యాపీ బర్త్ డే' ఆమెకు చేదు అనుభవాన్ని అందించింది. మరి ఇప్పుడు 'సతీ లీలావతి' ఎలాంటి అనుభవాన్ని అందించిందో చూద్దాం. చిన్నప్పటి నుండి తల్లిదండ్రులు (పవిత్ర లోకేష్, నరేశ్) చీటికీమాటికి కీచులాడుకోవడంతో చిన్నారి లీల (లావణ్య త్రిపాఠి) మానసికంగా బాగా డిస్టర్బ్ అవుతుంది. పెరిగి పెద్దయ్యాక సైకియాట్రిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) ఆమెలో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుతాడు. సేతులోని గుడ్ క్వాలిటీస్ నచ్చి అతన్నే ఆమె పెళ్ళాడుతుంది. సేతు కారణంగా ఆమె మూడేళ్ళలో స్టార్ డైరెక్టర్ గా ఎదుగుతుంది. అక్కడ నుంచే ఆమె కష్టాలు మొదలవుతాయి. భార్య షూటింగ్స్ బిజీలో తనను పట్టించుకోక పోవడంతో సేతు డిప్రెషన్ కు లోనవుతాడు. ఆ సమయంలో నర్స్ నికోలా సెబాస్టియన్ (మడోన్నా సబాస్టియన్) కు దగ్గరవుతాడు. భార్యకు విడాకులిచ్చి... నికోలాను పెళ్ళి చేసుకోవాలని సేతు అనుకుంటాడు. ఆ విషయాన్ని లీలకు చెప్పినప్పుడు ఆమె ఎలా రియాక్ట్ అయ్యింది? ప్రేమించి మరి పెళ్ళి చేసుకున్న భర్త దూరం అవుతాడని తెలిసి ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఈ ప్రేమజంట విడిపోయిందా? తప్పులు దిద్దుకుని జీవితాన్ని కొనసాగించిందా? దానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ? అనేదే ఈ సినిమా కథ. చిన్న చిన్న కారణాల వల్ల భార్య భర్తలు విడిపోవడం చూస్తున్నాం. ఈ కథలోనూ అలాంటి సిల్లీ రీజనే దర్శకుడు తీసుకున్నాడు. భార్య దర్శకురాలని తెలిసి, ఆమె తనకు తగినంత సమయం ఇవ్వలేదని గుర్తించి, అదీ సైకాలజిస్ట్ అయిన ఓ వ్యక్తి అదే కారణంతో ఆమెకు విడాకులు ఇవ్వాలను కోవడం సిల్లీగా అనిపిస్తుంది.




## ఓటిటిలోకి వచ్చేస్తోన్న దురంధర్-2

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ 2 ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ సినిమా డిజిటల్ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, తాజాగా ఓటీటీ విడుదల తేదీపై స్పష్టత వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా అద్భుత వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడు మే 15 నుంచి ఈ సినిమా ఓటీటీలో ప్రసారం కానుందని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. 'ధురంధర్ 2' ఒకేసారి రెండు ప్రముఖ ఓటీటీ వేదికల్లో విడుదల కానుంది. భారతదేశంలో ఈ చిత్రం జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుండగా, విదేశీ ప్రేక్షకుల కోసం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. అంతేకాకుండా ఈ సినిమాను కేవలం హిందీలోనే కాకుండా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు. దీంతో దక్షిణాది ప్రేక్షకులు కూడా తమ భాషలో ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. మరో ప్రత్యేకత ఏమిటంటే.. థియేటర్లలో ప్రదర్శించిన సాధారణ వెర్షన్‌కు భిన్నంగా, ఓటీటీలో 'రా అండ్ అన్‌కట్' వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. అంటే థియేటర్లలో చూపించని కొన్ని ప్రత్యేక సన్నివేశాలు కూడా ఓటీటీ వెర్షన్‌లో ఉండనున్నాయి. దీంతో అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. 2025 చివర్లో విడుదలైన 'ధురంధర్' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ సీక్వెల్ మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన మొదటి రోజు నుంచే అద్భుత స్పందన అందుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారతీయ సినీ చరిత్రలో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో రెండో స్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో మొదటి స్థానంలో 'దంగల్' కొనసాగుతుండగా, 'బాహుబలి 2'ను వెనక్కి నెట్టి 'ధురంధర్ 2' రెండో స్థానాన్ని దక్కించుకోవడం విశేషంగా మారింది. ఈ చిత్రాన్ని దర్శకుడు ఆదిత్య ధర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. సినిమాలో సారా అర్జున్, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, మాధవన్ కీలక పాత్రల్లో నటించారు. భారీ యాక్షన్ సన్నివేశాలు, స్పై నేపథ్యం, ఉత్కంఠభరిత కథనం,

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# స్పోర్ట్స్

# ఓటముల నుంచి లక్నోకు భారీ ఊరట



ఓటముల్లో రికార్డులు నమోదు చేసిన లక్నో సూపర్ జియాంట్స్ అద్భుతం చేసింది. టాప్‌లో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ ఇచ్చింది. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన పంత్ సేన మ్యాచ్‌ను సొంతం చేసుకుని వరుస ఓటములకు బ్రేక్ ఇచ్చింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బెంగళూరు తీవ్రంగా శ్రమించినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. 9 పరుగుల తేడాతో లక్నో విజయం సాధించి హ్యాట్రిక్ ఓటముల నుంచి ఊరట పొందింది.పలుమార్లు వర్షం అంతరాయంతో ఆలస్యంగా జరిగిన ఈ మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించగా.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జియాంట్స్ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ అద్భుతమైన సెంచరీతో అద్భుతం చేయగా.. అర్షిన్ కులకర్ణి 17 పరుగులు నమోదు చేశాడు. వర్షం పడినా.. పిచ్ ఎలా మారినా కూడా మార్ష్ మాత్రం చెలరేగి ఆడాడు. 56 బంతుల్లో 111 పరుగులు చేసి దుమ్మురేపగా.. వాటిలో 9 బౌండరీలు, 9 సిక్సర్లు బాదాడు. నికోలస్ పూరన్ 38, కెప్టెన్ రిషబ్ పంత్ 32 పరుగులతో రాణించి ప్రత్యర్థికి భారీ స్కోర్‌ను లక్ష్యం విధించారు. లక్నో స్కోర్‌ను కట్టడి చేయడంలో బెంగళూరు బౌలర్లు కొంత తడబడ్డారు. జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్యా, రసిక్ సలామ్ తలా ఒక్కో వికెట్ తీయగా.. మిగతా బౌలర్లు వికెట్ పడగొట్టడంలో విఫలమయ్యారు.టాపార్డర్ చేతులెత్తేసిన వేళ మిడిలార్డర్ గొప్పగా పోరాడంతో 19 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయిన బెంగళూరు 7 పరుగుల స్వల్ప తేడాతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. జాకోబ్ బెతెల్ 4 పరుగులకు ఔటవగా.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ డకౌట్ అవడంతో బెంగళూరు కష్టాల్లో పడింది. ఓపెనర్లు వెనుదిరిగిన వేళ దేవదత్ పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుతంగా ఆడి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. పడిక్కల్ 34 పరుగులతో రాణించగా.. రజత్ 31 బంతుల్లో 61 స్కోర్ చేసి సత్తా చాటాడు. జితేశ్ శర్మ ఒక్క పరుగు మాత్రమే చేయగా.. టిమ్ డేవిడ్ గొప్పగా పోరాడి 40 పరుగులు తీశాడు. విజయం కోసం కృనాల్ పాండ్యా (28లి), రొమారియో షెఫర్డ్ (23లి) ఆఖరి బంతి వరకు పోరాటం చేశారు. ఒక దశలో గెలిచేస్తారనుకున్న సమయంలో బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు రాలేకపోయాయి. ఫలితంగా బెంగళూరు మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది. లక్నో బౌలర్లు ప్రారంభంలో అద్భుతంగా బౌలింగ్ చేయగా.. తర్వాత దాన్ని కొనసాగించలేకపోయారు.యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బంతులు వేసి కీలకమైన మూడు వికెట్లు తీశాడు. షాబాజ్ అహ్మద్ రెండు వికెట్లతో సత్తా చాటగా.. సీనియర్ బౌలర్ షమీ ఒక వికెట్ తీశాడు. వరుస వికెట్లు తీసిన అనంతరం మిగతా వికెట్లు తీయడంలో తడబడడమే కాకుండా స్కోర్‌ను కూడా నియంత్రించలేకపోయారు. ఫలితంగా ఓవర్లన్నీ ముగిసేవరకు మ్యాచ్ ఫలితం దోబుచులాడింది. కానీ ఆఖరి బంతికి ఊరటనిచ్చేలా మ్యాచ్ జరిగింది. డబుల్ హ్యాట్రిక్ ఓటముల తర్వాత లక్నో సూపర్ జియాంట్స్ కీలక మ్యాచ్‌లో విజయం సాధించింది. పది మ్యాచ్‌లు ఆడిన లక్నో మూడు విజయాలు, 7 ఓటములు చవిచూసింది. బెంగళూరుతో మ్యాచ్‌లో గెలిచి రెండు పాయింట్లు ఖాతాలో వేసుకున్నా పాయింట్ల పట్టికలో చివరి స్థానంలోనే లక్నో కొనసాగుతోంది. ఇక బెంగళూరు జట్టు వరుసగా రెండో ఓటమి సాధించగా.. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి ఆరు విజయాలు, నాలుగు ఓడిపోయింది. ఓడిపోయినా కూడా పాయింట్ల పట్టికలో టాప్ 3లోనే బెంగళూరు కొనసాగుతోంది.



## టీమిండియాలోకి వైభవ్ ఎంట్రీ?

భారత క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ పరుగుల వరద పారిస్తున్న ఈ టీనేజ్ సెన్సేషన్ గురించి టీమిండియా వెటరన్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ కేవలం టీ20లకే పరిమితం కాకుండా టెస్టు క్రికెట్ కూడా ఆడాలని, అప్పుడే ఒక ఆటగాడిగా పరిపూర్ణత వస్తుందని పుజారా అభిప్రాయపడ్డారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వంటి అతిపెద్ద లీగ్‌లో వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 404 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భవిష్యత్తు టీమ్ ఇండియా స్టార్‌గా అవతరించాడు. వైభవ్ పెర్ఫార్మెన్స్ చూసి అతడిని వెంటనే టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే పుజారా మాత్రం వైభవ్ టెస్టు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారు. "వైభవ్ టీ20ల్లో అద్భుతంగా ఆడుతున్నాడు, అతడికి త్వరలోనే టీమిండియా పిలుపు వస్తుంది. కానీ టెస్టు క్రికెట్ అనేది ప్రతి యువ ఆటగాడి మనసులో ఉండాలి. ఒక ఆటగాడికి గౌరవం, పట్టుదల, టెక్నిక్ అనేవి టెస్టుల నుంచే వస్తాయి. సామర్థ్యం ఉంటే వైభవ్ కచ్చితంగా టెస్టుల్లో కూడా రాణించాలి" అని పుజారా పేర్కొన్నారు. టెస్టు క్రికెట్ గొప్పదే అయినప్పటికీ.. వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) నిపుణులకు కూడా తమదైన ప్రాముఖ్యత ఉంటుందని పుజారా చెప్పారు. శ్రేయస్ అయ్యర్, వైభవ్ వంటి ఆటగాళ్లను వారి బలాబలాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు ఆటగాళ్లను ఎంపిక చేసే విధానాన్ని ఆయన సమర్థించారు. దీనివల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఆయా ఫార్మాట్లలో జట్టు మరింత బలంగా తయారవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జియోస్టార్ సిటివి హిందీ ఫీడ్ నిపుణుడిగా తన కొత్త పాత్ర గురించి కూడా పుజారా ముచ్చటించారు. టీవీలో మ్యాచ్ విశ్లేషణ చేయడం ద్వారా అభిమానులకు ఆటలోని లోటుపాట్లను వివరించవచ్చని ఆయన చెప్పారు. ఆటగాడిగా తనకున్న అనుభవం ద్వారా ఫీల్డ్‌లో జరిగే పరిస్థితులు, టెక్నిక్, బౌలింగ్ వ్యూహాలను విడమర్చి చెప్పడం వల్ల కుర్రాళ్లకు కూడా ఆటపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఒక ఆటగాడు ఒక షాట్‌ను ఎలా ఆడాడు లేదా బౌలర్ ఏ యాంగిల్ వాడుతున్నాడు వంటి విషయాలు ప్రేక్షకులకు తెలియజేయడం తనకు సంతోషంగా ఉందన్నారు.

## పూర్తిగా మారిపోనున్న ఐపీఎల్ షెడ్యూల్..

ఐపీఎల్ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్... ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్ ఐపీఎల్ భవిష్యత్తులో మరిన్ని మెరుపులు మెరిపించబోతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ అభిమానులను అలరిస్తుండగానే, బీసీసీఐ ( రాబోయే సీజన్ల కోసం ఒక భారీ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. ఇకపై ఐపీఎల్ అంటే కేవలం రెండు నెలల సందడి మాత్రమే కాదు.. అంతకు మించి ఉండబోతోంది. ముఖ్యంగా మ్యాచ్‌ల సంఖ్య విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా లీగ్ భవిష్యత్తుపై ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాబోయే మీడియా రైట్స్ సైకిల్ (2028 నుంచి) కోసం టోర్నమెంట్ ఫార్మాట్‌లో పెద్ద మార్పులు చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. ప్రస్తుతం ఒక సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు జరుగుతుండగా, 2028 నుంచి ఈ సంఖ్యను ఏకంగా 94కి పెంచబోతున్నారు. దీనివల్ల ఆటగాళ్లకు సవాలు పెరగడమే కాకుండా, ప్రేక్షకులకు మరిన్ని ఉత్సాహభరితమైన పోరాటాలు చూసే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక టీమ్ లీగ్ స్టేజ్‌లో 14 మ్యాచ్‌లు ఆడుతోంది. అయితే 2028 నుంచి ఈ సంఖ్య 18కి చేరనుంది. అంటే టోర్నమెంట్ మరికొన్ని రోజులు అదనంగా జరుగుతుంది. పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్ కోసం జరిగే యుద్ధం ఇప్పుడు మరింత రసవత్తరంగా మారనుంది. మ్యాచ్‌ల సంఖ్య పెరగడం వల్ల ఆటగాళ్ల ఫిట్‌నెస్, జట్ల వ్యూహాలు కూడా మారే అవకాశం ఉంది. మ్యాచ్‌లు పెరుగుతున్నాయి కదా అని కొత్త టీమ్స్ వస్తాయని భావిస్తే పొరపాటే. ఐపీఎల్‌లో ప్రస్తుతానికి ఉన్న 10 జట్లే కొనసాగుతాయని అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు.

## ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ హెచ్చరిక

ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న క్రికెట్ లీగ్ ఐపీఎల్‌లో ఇప్పుడు ఒక కొత్త చర్చ మొదలైంది. గ్రౌండ్‌లో ఆట కంటే కూడా ఆటగాళ్ల క్రమశిక్షణ పైనే ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో జరిగిన కొన్ని సంఘటనలు బీసీసీఐని ఆలోచనలో పడేశాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేయడం నుంచి డగౌట్‌లో ఫోన్లు వాడటం వరకు రకరకాల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు ఇప్పుడు చాలా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకుంది. దీనికోసం అన్ని ఫ్రాంచైజీలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లెటర్ పంపింది. ఈ లేఖలో అన్నిటికంటే ముఖ్యమైంది హనీ ట్రాప్ వార్నింగ్. ఐపీఎల్ టోర్నీ జరుగుతున్నప్పుడు ప్లేయర్స్ టార్గెట్‌గా హనీ ట్రాప్స్ జరిగే అవకాశం ఉందని బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. కొంతమంది ప్లేయర్స్ టీమ్ మేనేజర్లకు చెప్పకుండా హోటల్ రూమ్స్‌కు అనధికారిక వ్యక్తులను రానిస్తున్నట్లు బోర్డు దృష్టికి వచ్చింది. ఇది సెక్యూరిటీ పరంగా చాలా ప్రమాదకరమని, అందుకే ఇకపై ఎవరైనా గెస్ట్ రావాలి అంటే ఖచ్చితంగా గెస్ట్ అప్రూవల్ సిస్టమ్ ద్వారానే రావాలి అని బోర్డు రూల్ పెట్టింది. గెస్టుల వివరాలను ప్రతిరోజు రికార్డు చేయాలి అని టీమ్ మేనేజర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తున్న వీడియో అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా లేఖలో ప్రస్తావించారు. డ్రెస్సింగ్ రూమ్స్‌లో, డగౌట్స్‌లో లేదా టీమ్ హోటల్స్‌లో వేప్స్, ఈ సిగరెట్లు వాడటంపై పూర్తిస్థాయిలో నిషేధం విధించారు. భారత చట్టాల ప్రకారం కూడా ఇది నేరమని, ఎవరైనా నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని బోర్డు హెచ్చరించింది. క్రమశిక్షణ అనేది టీమ్ గౌరవానికి సంబంధించిన విషయమని, దీనిని అశ్రద్ధ చేయకూడదని స్పష్టం చేసింది.కేవలం ఆటగాళ్లకు మాత్రమే కాదు, టీమ్ యజమానులకు కూడా బీసీసీఐ కొన్ని ఆదేశాలు ఇచ్చింది. మ్యాచ్ లైవ్‌లో జరుగుతున్నప్పుడు యజమానులు ప్లేయర్స్ దగ్గరకు వెళ్లడం, వారిని హగ్ చేసుకోవడం లేదా ఫిజికల్?గా ఇంటరాక్ట్ అవ్వడం వంటివి చేయకూడదు అని బోర్డు కోరింది. ఇలాంటి పనులు టీమ్ పరిస్థితులను దెబ్బతీస్తాయని సైకియా తన లేఖలో పేర్కొన్నారు. ప్లేయర్స్, మ్యాచ్ అఫీషియల్స్ ఉండే ఏరియా ప్రోటోకాల్స్?ను యజమానులు ఖచ్చితంగా పాటించాలి అని, ఆటగాళ్లకు డిస్టర్బెన్స్ కలిగించకూడదు అని లేఖలో వివరించారు. చాలామంది ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ సెక్యూరిటీ ఆఫీసర్లకు చెప్పకుండా హోటల్ నుంచి బయటకు వెళ్తున్నట్లు బీసీసీఐ గమనించింది. ఇలా ఇష్టం వచ్చిన టైమ్‌లో హోటల్ దాటి బయటకు వెళ్లడంపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి టీమ్ హోటల్ వదిలి వెళ్లే ప్రతిసారి మూవ్‌మెంట్ లాగ్‌లో ఎంట్రీ ఇవ్వాలి అని చెప్పింది. సెక్యూరిటీ లియాజన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్?కు ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా ఎక్కడికి వెళ్లకూడదు అని రూల్ పెట్టింది. ఇది ప్లేయర్స్ సేఫ్టీకి చాలా ముఖ్యమని బోర్డు భావిస్తోంది. ఈ కొత్త నిబంధనలను అమలు చేయడంలో టీమ్ మేనేజర్లదే కీలక పాత్ర అని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ అడ్వైజరీ అందిన 48 గంటల్లోపు ప్రతి టీమ్ మేనేజర్ తన ప్లేయర్లకు, సపోర్ట్ స్టాఫ్?కు ఈ విషయాలపై క్లారిటీ ఇవ్వాలి.




## చాహల్ వాపింగ్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న సమయంలో పంజాబ్ కింగ్స్ ( వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ఒక నెగటివ్ న్యూస్ తో హెడ్ లైన్స్ లోకి వచ్చాడు. విమాన ప్రయాణంలో చాహల్ వాపింగ్ చేస్తూ కనిపించాడనే వార్త ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. పంజాబ్ టీమ్ సభ్యులు అహ్మదాబాద్ నుండి హైదరాబాద్ వస్తున్న సమయంలో ఈ ఇన్సిడెంట్ జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు, ఫోటోలు చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. నిజానికి ఈ విషయం బయటకు రావడానికి టీమ్ మేట్ అర్ష్‌దీప్ సింగ్ కారణమయ్యాడు. అతను షూట్ చేసిన ఒక వ్లాగ్‌లో చాహల్ ఇ-సిగరెట్ వాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పక్కనే శశాంక్ సింగ్ వంటి ఇతర ప్లేయర్లు కూడా ఉన్నారు. అయితే ఈ వీడియో వైరల్ అవ్వగానే, పంజాబ్ కింగ్స్ యాజమాన్యం లేదా అర్ష్‌దీప్ సింగ్ ఆ వీడియోను ఎడిట్ చేసి, చాహల్ ఉన్న సీన్లను కట్ చేసి మళ్ళీ అప్లోడ్ చేశారని నెటిజన్లు స్క్రీన్ షాట్లతో సహా నిరూపిస్తున్నారు. విమానంలో ఇలాంటి పనులు చేయడం తోటి ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడమేనని సోషల్ మీడియా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఐపీఎల్ 2026లో వాపింగ్ వివాదం రావడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితమే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్, పంజాబ్ కింగ్స్ తో మ్యాచ్ జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్ లో వాపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కాడు. ఆ విషయంలో బీసీసీఐ సీరియస్ అయ్యి, పరాగ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఇప్పుడు చాహల్ కూడా అదే తరహాలో దొరికిపోవడంతో క్రమశిక్షణపై చర్చ మొదలైంది.ఈ వివాదాలపై టీమిండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా స్పందించాడు. ముఖ్యంగా రియాన్ పరాగ్ ఇన్సిడెంట్ ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటివి కెరీర్ కు అస్సలు మంచిది కాదని అన్నాడు. మీ పర్సనల్ లైఫ్ లో ఏం చేసినా ఎవరికీ అభ్యంతరం ఉండదని, కానీ ఒక పబ్లిక్ స్పేస్ లో ఉన్నప్పుడు, ముఖ్యంగా ఒక టీమ్ కు లీడర్ గా, ఎంతో మంది యువతకు ఇన్స్పిరేషన్ గా ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని హితవు పలికాడు. ఇలాంటి చిన్న చిన్న తప్పుల వల్ల మొత్తం ఇమేజ్ డ్యామేజ్ అయ్యే ఛాన్స్ ఉందని అశ్విన్ హెచ్చరించాడు. ప్రస్తుతానికి ఈ వీడియోపై పంజాబ్ కింగ్స్ టీమ్ గానీ, చాహల్ గానీ ఎటువంటి స్టేట్మెంట్ ఇవ్వలేదు. విమానాల్లో స్మోకింగ్ లేదా వాపింగ్ చేయడం చట్టరీత్యా నేరం. మరి దీనిపై విమానయాన సంస్థ లేదా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందో వేచి చూడాలి. ప్లేయర్లు మైదానంలోనే కాకుండా బయట కూడా స్పోర్ట్స్ మన్ స్పిరిట్ తో మెలగాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## భువనేశ్వర్ కుమార్ అరుదైన రికార్డ్

ఐపీఎల్ అంటేనే రికార్డుల అడ్డా. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్‌లో ఒక మెమరబుల్ మైలురాయిని చేరుకున్నాడు. గురువారం లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ బరిలోకి దిగడమే ఒక రికార్డుగా మారింది. ఐపీఎల్ హిస్టరీలో ఇప్పటివరకు ఏ ఫాస్ట్ బౌలర్ కూడా 200 మ్యాచ్‌లు ఆడలేదు. ఆ ఘనత సాధించిన ఫస్ట్ ఇండియన్ పేసర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్ లో 200 పైగా వికెట్లు తీసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ కూడా అతనే కావడం విశేషం. ఈ అరుదైన రికార్డుపై భువనేశ్వర్ కుమార్ స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. ఏ మైలురాయి అయినా స్పెషలే అని, కానీ 200 మ్యాచ్‌లు ఆడటం అనేది నిజంగా ఒక బిగ్ అచీవ్‌మెంట్ అని ఆనందం వ్యక్తం చేశాడు. అందుకే చాలా గర్వంగా, హ్యాపీగా ఉందని, ముఖ్యంగా గతేడాది కప్పు గెలిచిన జట్టులో ఉంటూ, ఈ సీజన్ లో కూడా అద్భుతంగా రాణిస్తున్న సమయంలో ఈ రికార్డ్ రావడం ఇంకాస్త స్పెషల్ ఫీలింగ్ ఇస్తోందని పేర్కొన్నాడు. తన కెరీర్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటన్నిటిలో ఒకదాన్ని ఎంచుకోవడం కష్టమే కానీ, ఇన్నేళ్ల ప్రయాణంలో తన తొలి వికెట్ మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపాడు. అక్కడి నుండే ఈ జర్నీ మొదలైందని భువీ తన మనసులోని మాటను చెప్పాడు. ప్రస్తుత కాలంలో టీ20 ఫార్మాట్ చాలా వేగంగా మారిపోతోంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతున్నారు. దీనిపై భువనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాటర్ల అప్రోచ్ పూర్తిగా మారిపోయిందని, పవర్‌ప్లేలో వాళ్ళు చాలా అగ్రెసివ్‌గా ఆడుతున్నారని విశ్లేషించాడు. ఇలాంటి కండిషన్స్‌లో బౌలర్లు నిరంతరం తమ గేమ్ ను ఇంప్రూవ్ చేసుకోవడం ఒక పెద్ద ఛాలెంజ్ అని, కానీ తాను మాత్రం ఎప్పుడూ తన బేసిక్స్‌ను బలంగా ఉంచుకోవడానికే ట్రై చేస్తానని, అదే తనను ఇన్ని ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా ముందుకు నడిపిస్తోందని వివరించాడు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే భువనేశ్వర్ ఈ మ్యాచ్‌లో వికెట్ తీయలేక పోయాడు. నాలుగు ఓవర్లలో 34 పరుగులు ఇచ్చాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ ఇంజూరీ సమస్యలతో సతమతమవుతోంది. జోష్ ఇంగ్లిస్, మొహ్సిన్ ఖాన్, ఆవేష్ ఖాన్ వంటి కీలక ప్లేయర్లు ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అర్షిన్ కులకర్ణి, మయాంక్ యాదవ్, షాబాజ్ అహ్మద్ టీమ్ లోకి వచ్చారు.

భారత క్రికెట్ లో భువనేశ్వర్ కుమార్ ఒక సైలెంట్ వారియర్ లాంటివాడని, ఎన్ని కొత్త టెక్నాలజీలు వచ్చినా, ఎంతమంది కొత్త బౌలర్లు వచ్చినా భువీ తన స్వింగ్ తో బ్యాటర్లను వణికించగలడని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. 200 మ్యాచ్‌ల ఈ మైలురాయి అతని హార్డ్ వర్క్ కు నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

